ఏ దేశమేగినా ఎందు కాలిడినా డబ్బు చాలా ముదరష్టపుది.
తనా మనాలను ఛిద్రం చేసి, మానవసంబంధాలను బలికోరే
క్షుద్ర నైజం డబ్బుకి మాత్రమే ఉంది. ఇది సర్వకాలీన సత్యం.

శ్రీరమణ

# 4 నాలుగో ఎకరం

ఆర్. గిరిధర్ గౌడ్





వాలు ఎండలో కాలేజి మెట్ల మీంచి ఓ పక్కగా నడిచి వస్తూ ఎదురయ్యాడు సాంబశివరావు.

"ఏంటి ఇంత పొద్దున్నే...?" అంటూ పలకరించా.

"మీ కోసమే... నేనీపూట మనూరెళ్తున్నా."

"సరే... వెళ్లిరా... ఏం ఏవన్నా అర్జంటు పనా?"

"రేత్రి మా దుక్కిటెడ్లు కల్లోకొచ్చాయండీ," అన్నాడు సాంబశివరావు ఎటో చూస్తూ.

నేనొక్కసారి వులిక్కిపడ్డాను. అంతలోనే ముచ్చటపడ్డాను.

ఒక మెట్టు దిగి, అతని భుజం మీద చెయ్యి వేసి, "అచ్చమైన రైతుబిడ్డ వనిపించావ్ శివా. వెళ్లిరా," అంటూ చిరునవ్వుతో సాగనంపాను.

వెనక్కి తిరిగి చూడకుండా వడివడిగా మెట్లు దిగి వెళ్లిపోతున్న అతన్ని చూస్తూ వుండిపోయాను.

* * *

మా ఊరునించి రోడ్డైతే రెండు గంటలు, రైలైతే గంట ప్రయాణంలో మా కాలేజి టౌనుంది. చాలా పేరున్న పాతకాలం కళాశాల. ఎమ్మెస్సీ పూర్తయాక జూనియర్ లెక్చరర్‌గా వుద్యోగం వచ్చింది. చదివిన కాలేజీలోనే వుద్యోగం రావడం ఒక వరంగా తోచేది. అంతకుముందు దాకా పాఠాలు చెప్పిన గురువులంతా అడుగడుగునా శిష్యవాత్సల్యంతో పలకరిస్తుంటే, అమ్మ ఒడిలో వున్నంత సంబరంగా ఉండేది.

మా ఊరి మోతుబరి రాఘవయ్యగారి అబ్బాయ్ ఈ సాంబశివరావ్. రాఘవయ్య పద్ధతిగల రైతు. అందుకే ఆయన మారుపేరు 'పెదకాపు.'

మా వూరిపక్క జూనియర్ కాలేజీలో శివ ఇంటర్ నెట్టాక, ఆనక ఏ సెట్టు గట్టెక్కలేక మా కాలేజికి వచ్చిపడ్డాడు.

లాంగ్ టర్మ్ వైపు చూస్తుంటే, "ఏం పర్లేదు శివా, ఎంట్రెన్స్‌లతోనే చదువులు లేవు. ఇంకా పిచ్చబోలెడున్నాయ్," అని ధైర్యం చెప్పా.

"అయితే, యిహనేం, మీ దగ్గరే పడేసుకోండి. మంచీసెబ్బర మీరే చూసుకోండి," అన్నారు రాఘవయ్య.

పెదకాపు మాట కాదనే ఇరువేలేదు. మా రెండు కుటుంబాలు తాతలనాటి నించి సన్నిహితం. పైగా శివ నాకు చిన్నప్పట్నించి తెలుసు.

గారాబంగా పెరిగాడు. అంత తేలిగ్గా ఎవరితో కలవడు. కలిస్తే వదలడు. నేను పది పన్నెండేళ్లు పెద్దవాణ్ణి. నేనంటే కొంచెం చనువు, ఇంకొంచెం ఇష్టం, ఇంకాస్త గౌరవం.

మా ఊరి వేణుగోపాలస్వామి ఆలయానికి మేం వంశపారంపర్య అర్చకులం. నాన్న కృష్ణస్వామి పరమ వైష్ణవుడు.

నాన్న చాదస్తాలన్నిటికీ అమ్మ భక్తితో హారతులు పట్టేది.

'పూజారమ్మ అన్ని రుతువులా పూసిన తంగేడల్లే గుడి ఆవరణానికే నిండు,' అని నలుగురూ అనుకునేవారు.

ఆలయ ప్రాకారం లోపలే మా ఇల్లు. నేను, వల్లి రెండు వారాలు కాగానే మా వూరెళ్లేవాళ్లం. అప్పటికే అమ్మ నాన్న ఎన్నాళ్లో అయినట్టు మాకోసం ఎదురు చూస్తుండేవారు. వెళ్తూనే వల్లి గుడిపనిలో పడిపోయేది. నాన్న మాత్రం, 'కోడలు మా వేణుగోపాలుడి సేవలో నిమగ్నమైం,'దని తెగ మురిసిపోయేవాడు. దేవతార్చన సామగ్రికి పులికాపు పెట్టడం, ఆ వున్న రెండు పూటలూ ఇంకో రెండు నైవేద్యాలు చేయడంతో నాన్నకు బ్రహ్మానందమైపోయేది. 'విద్యలెరిగిన జాబిల్లివే... నా వల్లీ...' అంటూ కూని రాగాలు తీస్తూ నేను కూడా పనులు అందుకునేవాణ్ణి. అటు అత్తమామల్ని భక్తితో, భర్తని రక్తితో ఏకకాలంలో సేవిస్తూ వల్లి నాకు సమ్మోహనంగా కనిపించేది.

ఊళ్లోకి వస్తే రాఘవయ్యగారింటికి వెళ్లాల్సిందే, కాసేపు మాటామంతీ సాగించాల్సిందే! కృష్ణస్వామి రాఘవయ్య కుటుంబానికి పెద్దదిక్కు, మొక్కు. ఆ ఇంట్లో ఏ చిన్న సమస్యయినా, సంతోషమైనా కృష్ణస్వామికి చెప్పుకోవడంతోనే శ్రీకారం చుట్టుకొనేది.

* * *

సాంబశివరావు వచ్చేసి రోజులూ వారాలూ గడిచినా పత్తాలేడు. ఆసారి వూరెళ్లగానే వాళ్లింటికి వెళ్లాను. అంతా మా అదృష్టం, మా బిడ్డ మా ఇంటికొచ్చేశాడని అమ్మానాన్నలు మురిసిపోతున్నారు. తీర్థంలో తప్పిపోయిన బిడ్డ తిరిగొచ్చినట్టుగా ఉంది వాళ్ల వైఖరి. నేను నోరు విప్పకుండా వారిని గమనిస్తున్నా.

శివ కనిపించాడు. మాంచి జోరు మీదున్నాడు. రంగు డిజైన్ల లుంగీమీద చేతులు పైకి మడిచిన చొక్కా, చేతివేళ్లతోనే దువ్విన క్రాపు, తీరైన నాటు చెప్పులు-నికార్సయిన వూరి కుర్రాడిలా కనిపించాడు శివ. ఇంటి దిగులు పోయిందేమో హాయిగా గంపలోంచి బయటపడ్డ కోడిపుంజులా ఉన్నాడు.

బోలెడు మాట్లాడుకున్నాం. మళ్లీ రాలేదేమని నేనడగనూ లేదు, అతను చెప్పనూ లేదు. నాతోపాటు గుడిదాకా వచ్చాడు శివ. గాలిగోపురం దగ్గర నా చెయ్యి వదిలి వెనక్కి తగ్గాడు.

గాలిగోపురం 'పడి' దాటుతూ, "నువు అదృష్టవంతుడివి శివా, నాలాంటి వాడికి సొంతూరు వచ్చేద్దామనివున్నా కుదర్దు కదా," అన్నాను.

రాని నవ్వు తెచ్చుకొని, "నన్ను మీరు బెమ్మాండంగా సవదాయిస్తున్నార్లెండి," అంటూ నా మాటల్ని చాలా తేలిగ్గా తీసుకుంటూ శివ పెద్దపెద్ద అంగలతో దూర మయ్యాడు.

* * *

మేము వీలు దొరికినప్పుడల్లా సొంతింటికి వస్తూనే వున్నాం. ఎవరు పట్టించు కున్నా పట్టించుకోకపోయినా ఏరువాకలు వచ్చి వెళ్తూనే వున్నాయ్. గుడి గోపురం గూళ్లలో పావురాల సందడి మామూలుగానే ఉంది.

వచ్చినప్పుడల్లా నేను, శివ వాహనశాలలో కూచుని, తాటికుంచెలతో వాహనా లపై పేరుకున్న దుమ్ము తుడుస్తూ మాటలు సాగించేవాళ్లం. దాపరికాలెరగని అతనితో మాటలు ఎంతసేపైనా గతుకుల్లేకుండా నడిచేవి. శివతో మాట్లాడుతుంటే చింతచెట్టు కొమ్మల్లో కూచుని చిగురులు నవ్వుల్తున్నట్టు, పంటకాలవ మధ్య నిలబడి అలల్ని దువ్వుతున్నట్టు ఉండేది. కష్టాన్ని కూడా సుఖంగా చెప్పేవాడు.

ఒక దఫా వచ్చినప్పుడు మాటల మధ్యలో వున్నట్టుండి, "మా దుక్కిటెడ్లు నన్ను దగా చేశాయ్ స్వామీ. వాటిని నమ్మి నేనింటికి చేరేసరికి అవి మాయమయ్యాయ్. ఇప్పుడు ఊరంతా గాలించినా ఒఖ్ఖ తెల్లగొడ్డు లేదు. అయినా వాటినెందుకనాల! అంతా మన జాతకం," అని గాఢంగా నిట్టూర్చాడు శివ.

నేను 'ఊఁ' కొట్టి ఊరుకున్నాను.

తాటికుంచెతో తుడవటం ఆపి, నన్ను సూటిగా చూస్తూ-

"మాధవస్వామీ! నేనెప్పుడన్నా నీకాడ నిజం దాచానేమోగాని అబద్ధం మాత్రం చెప్పలా... అప్పుడు... ఆరోజున ఎద్దులు కల్లోకొచ్చిన మాట నిజమేగాని, చెప్పని నిజం ఇంకోటుంది."

దిగ్గున శివ కళ్లలోకి చూశాను... చేతిలో తాటికుంచె పక్కన పెడుతూ.

"సరిగ్గా అంతకు రెండ్రోజులు ముందు మా నాన్న నన్నెతుక్కుంటా ఆస్టల్ కొచ్చాడు. వస్తానే ఆదరాబాదరగా, 'ఇదిగో ఈ పైకం ఉంచు. కట్టాల్సివాటికి కట్టుకో. చాలకపోతే మల్లా పంపుతా,' అంటూ చిన్న పేపర్ కాయితం పొట్లం నా జేబులో కుక్కాడు. 'సాంబా, తిండి యవ్వారంలో ఎనకా ముందు ఆడమాక. పండు పలం కొనుక్కుతింటా ఉండు...' అంటున్న నాన్న కళ్లు నన్ను కిందినించి పైదాకా తీరుగా గమనిస్తున్నాయ్.

"వెనకమాల్నించి మనూరి మున్సబు దిక్కులు చూస్తా, మెల్లగా అడుగులేస్తా వస్తన్నాడు. ఆయన్ని నాన్న వెంటేసుకొచ్చాడని నా కర్థమైంది.

"'కులుకు' లాల్చీ, నల్లకళ్లద్దాలు, మెడలో గాడితప్పిన బంగారు గొలుసు, చేతికి గుప్పెడు ఉంగరాలతో... మున్సబు మాకాడికొచ్చాడు.

“నాన్న సర్రున వెనక్కి తిరిగి, చిలుకు లాల్చీని వెనక్కి మళ్లించేందుకు ట్రయ లేశాడుగాని అది పెడ తిరిగింది. అక్కడే ఆగింది.

“బైకు కీ చెయిను చూపుడు వేలికి చుడతా ఇప్పుతా, మోరెత్తి- ‘... సాంబయ్యా, బాగా చదవాల్రా... అప్పటిలా కాదురా అబ్బీ... కొండ్రలు కరిగించుకు తిండానికి లేవ్. రూపాయ్ శిస్తు కట్టేటోళ్లం పదిపైసలు కడతన్నావిప్పుడు. కూత్తి గవనం చేసుకోవాల... బాగా చదవాల... ఏందంటే పెద్దోళ్లు కరుగ్గా చెప్పలేరు... మనమే తెల్సుకోవాల...’

“వచ్చేపోయే కుర్రాళ్లు ఈ డైలాగులిన్నా యిననట్టు ఎళ్లిపోతున్నారు.

“‘...నాలుగు వెండి తోడాలు షరాబ్బజార్లో అమ్మిన రొక్కం తెచ్చావిప్పుడు. బాబాయ్ ‘ఇవే ఆఖరి నాలుగూ,’ అన్నాడు. దుక్కమేసింది. ఏం చేస్తాం... అందుకని నే చెప్పేదేందంటే కష్టపడాల... బాగా సదవాల... ఎచ్చులకి పోకుండా సదూకుంటే రేప్పొద్దున నీకే కదా వైబోగం... బాబాయ్ ఉండబోయాడా, సూడబోతాడా...’

“అంబోతు నల్లద్దాలు పెట్టుకుని, పబ్లీకున నీతులు రంకెలేస్తున్నట్టనిపించింది.

“ఆ మాటలకోరు నా నసాళానికి అంటింది.

“ఆడ్ని బిళ్లంగోడు ఆడాలనిపించింది.”

లోపల్లోపల మాగుతున్న కోపానికి కసి వెటకారం తోడై శివ నిప్పు మీద ఉప్పులా పేల్తున్నాడు.

ఆ ధోరణి వింటుంటే, శివ తీరిగ్గా కూర్చుని పళ్లు నూరుతూ మున్సబు మీద అక్కసు తీరేట్టు, రకరకాల మాటల్ని బుర్రలో దండలు గుచ్చాడనిపించింది.

నేను మౌనంగా వింటున్నా.

శివ కాక కొంచెం దిగింది. గొంతు సవరించుకొని-

“నా బుర్రని క్షణంలో ఏకేశాడు మున్సబు. నా జుట్టు ఎర్రబడింది.

“నాలో రేగిన వెర్రికోపం నాన్నలో బుసలు కొడుతోంది.

“మున్సబు వుసి ఆపాలని నోరెత్తకుండా నానా హైరానా పడుతున్నాడు నాన్న.

“చివరికి, ‘...అరెరె... మీ అమ్మిచ్చిన చేసంచి బండికాడే వదిలేశా,’నంటూ నన్నూ మున్సబుని గాభరాపెడుతూ బయటికి లాక్కెళ్లాడు. అమ్మ పంపిన అప్పచ్చుల సంచీ నాలో పేరుకున్న కోరుని ఒక్కసారిగా దిగమింగింది. సెహంతా దిగిపోయి, అప్పుడింక ఏమీ జరగనట్టే వుంది.

“మున్సబు బైకుని సవరతీసి రోడ్డెక్కించే పనిలో పడ్డాడు.

“నాన్న రోడ్డెంక చూస్తా, ‘సాంబా! కొత్తచోట సొమ్మమ్మసూపినపుడు ఎవడో తెల్సినోడు లేపోతే తిరకాసులొస్తాయని ఈణ్ణి ఎంటేసుకొచ్చా... నా కర్మ... ఎపుడూ దొరికే పెదస్వామి ఈసారి దొరకలా...’ అంటూ నా చెవిలో సంజాయిషీ గొణిగి వడిగా అడుగులేశాడు.

“తప్పుచేసిన వాడల్లే మొహం దించుకుని నాన్న బైకెక్కాడు.

“నాకు ఆపుకోలేనంత ఏడుపొచ్చింది,” అంటూ శివ తల దించుకున్నాడు.

ఒకసారి చేతివేళ్లతో జుట్టు దువ్వుకున్నాడు.

శివ మళ్లీ అందుకొని, “ఇహ ఆ తర్వాత నోటికి ముద్ద దిగలేదు. కంటికి నిదర రాలేదు. అమ్మచేతి గవ్వలు, చక్కలు, చేగోడీలు నోటికి అడ్డమేసుకుని నీళ్లు తాగి మూడుపూటలు నడిపా. నా ఆలోచన తెగింది. ఇహ చెడ్డచేనుకి రెండు మంచెలా... కానిమ్మని మనూరు బయలెల్లా... మీకు కల మాత్రమే చెప్పా... నమ్మండి.”

“...ఔను చెప్పావ్ గుర్తుంది,” అన్నాను ముక్తసరిగా.

“ఈ జరిగింది నాకు తెల్సు, పెదకాపుకి తెల్సు, గుళ్లో దేవుడికి తెల్సు,” శివ గొంతు భారంగా అంది.

వాతావరణం చెమ్మగిల్లింది.

ఒక్కక్షణంలో శివ తెప్పరిల్లాడు.

“...మా పందెపెడ్ల తోడాలవి. మా అమ్మా నాయన కొట్టుకొచ్చిన యెండి కడియాలవి... నాకు మర్చిపోలేని గ్యాపకాలయి,” కళ్లు విప్పార్చి చిరునవ్వాడు శివ.

ఒక్కసారి అతని శ్రుతి మారింది.

“జోరున వాన పడుతుంటే, మొక్కజొన్న పొత్తులు ఏడేడిగా నోటితో వొలుచుకు తింటా నన్నొళ్లో కూచోపెట్టుకుని అమ్మా, నాన్న యెండితోడాల్ని నా కాళ్లకి పైదాకా తొడిగేవారు... నేను రెండు చేతులూ నేలకి ఆన్చి నాలుగు కాళ్ల మీద గల్‌గల్‌మంటా ఇల్లంతా పరుగులు పెట్టేవాణ్ణి. నాయన కుచ్చుల చెర్నాకోల గాలిలో తిప్పుతా నన్ను ‘హాయ్... హాయ్...’ అంటూ అదిలించేవాడు. ‘మా కోడెదూడండీ, మా ఇంటి కొంటె దూడండీ,’ అని ముద్దుచేస్తా పరుగులు పెట్టించేవాడు. నాన్న నవ్వులతో అలసిపోయే వాడు. ఇంతలో అమ్మ వెండిగిన్నెలో పాలబువ్వ కలుపుకొచ్చి, ‘మా తువ్వాయి బొజ్జ ఏడుస్తోందండీ... దాణా పెట్టాలండీ,’ అంటా నా పరుగులు ఆపేది. బువ్వ తినిపించేది. ఇవన్నీ మర్చిపోయే సంగతులా సామీ,” అంటూ ఆగాడు శివ.

కనురెప్పలు గట్టిగా మూశాడు.

రెండు కన్నీటి చుక్కలు రాలాయి.

శివ గాఢంగా శ్వాస వదిలి, “వాడు అనవసరంగా నా బుర్రని ఏకేశాడు మాధవయ్యా. నువ్ వాణ్ణొక తిట్టు తిట్టవా... నోట్నిండా... పెద్దగా... పోనీ ఇంగ్లీష్‌లో... కాదంటే సంస్కృతంలో... ప్లీజ్ నా కోసం... నా మంట చల్లారడం కోసం... తిట్టవయ్యా బాబూ,” గసిరినంత పని చేశాడు.

“పోనీ శివా... వాడి పాపాన వాడే పోతాడు,” అన్నాను ఉదాసీనంగా.

“అబ్బా!” వ్యంగ్యధోరణిలో అంటూ నా వంక చురుక్కున చూశాడు.

"నీ కంటే గుళ్లో ఆ నల్లరాయి నయం..." అంటూ శివ దులుపుతున్న శేష వాహనాన్ని అమాంతం రెండు చేతుల్తో కదిలించి పొందిగ్గా అమర్చి, కాస్త ఊరడిల్లాడు.

రెండు బల్లులు సందుల్లోంచి వచ్చి దూకాయ్.

శివ ఉలికిపాటుతో దులుపుకున్నాడు. అతని ధ్యాస మారింది.

శివ అలుపు, సొలుపు తగ్గి కొంచెం స్తిమితపడ్డాడు.

ఎంతైనా శివ తీరైన కుర్రాడు.

ఇంతలో అమ్మ 'మాధవా' అంటూ రెండు చిన్నగిన్నెల్లో బెల్లంపానకంలో నానేసిన అటుకులు అందించి వెళ్లింది- మంత్రంలాంటి మాట గొణుక్కుంటూ.

శివ అందుకొని, "ఈ పలారం మాత్రం బెమ్మాండం స్వామీ," అన్నాడు నవ్వుతూ.

చివరకి మా కబుర్లు తీయగా మారాయి.

కొన్నేళ్లుగా మా పరగణాని కరువు ఆవరించింది. అంతా బావున్నట్టే వుంటోంది గాని చేతిలో చిల్లిగవ్వ మిగలడం లేదు. ఈ పంట, ఆ పంట, పై పంట అనుకుంటూ ఎండమావి చుట్టూ తిరుగుతూ రైతు అలిసిపోయాడు. కలుపుదుబ్బుల్లా అప్పులు, వాటిపై వడ్డీలు అలివికానంతగా పెరిగి భయపెడుతున్నాయ్. ఆమధ్య సంక్రాంతికి వచ్చినపుడు నేను శివ ఎప్పటిలాగే కలిశాం.

మాటల మధ్యలో, "నేను బుద్ధిగా అక్కడే వుండుంటే, ఈపాటికి నాలుగేళ్ల చదువు అయ్యేది కదా చిన్నస్వామీ," అంటూ నిజాన్ని ప్రశ్నల్లే నామీద విసిరాడు శివ.

"ఇప్పుడు మాత్రం ఏమైందిలే శివా," అన్నాను, ఇంకేమనాలో తెలీక.

"ఇదిగో ఇదైంది," అని నవ్వుతూనే కాయలు కాసిన అరిచేతులు చూపించాడు. అంతలోనే చేతులు ముడిచేశాడు.

"ఇవి మొద్దుబారితే పర్లేదుగాని గుండెలు బండబారేట్టున్నాయ్ సామీ. వాళ్లు మాట్లాడే మాటలా... నిజంగా, ఉగ్గుపాలతో కక్కిస్తున్నారంటే నమ్మండి. మానం మర్యేద, సిగ్గు యెగ్గు గాదెలకెత్తాం... అవెటూ ఖాళీయేగందా. సామీ, వాళ్లు వాళ్ల డబ్బు ఏదోరోజు ఎనక్కి తీసుకోగల్రుగాని కూసిన కారుకూతలు తీసుకోగల్రా... అప్పులోళ్ల మాటకి రోషం పోయి బతుకుతున్నాం. దిశలు తెల్లారుతున్నాయ్," వెర్రిగొంతుకతో వేష్టపడ్డాడు శివ.

సవఁదాయించడానికి నా దగ్గర మాటల్లేకపోయాయ్.

"అయినా కరువుకి కక్కుర్తికి జనం అలవాటు పడ్డార్లెండి. కోరికలేవీ మనసుకి రాకుండా సుకంగా కాలం వెళ్లదీస్తున్నాంలెండి దేవుడి దయవల్ల."

శివ ముక్తాయింపుతో నా నిలువెల్లా చెమర్చింది. అరికాలు దాకా చెమట ఉరికింది.

అకాల వర్షాలు, వాయుగుండాల అతివానలు, పంట అనర్థాలు, దళారీ రాజ్యం అన్నీ కలిసి సేద్యగాళ్ల వెన్ను విరుస్తోంది. అందరూ తలొక బిరుదుతో ఆకాశానికెత్తేవారే

గాని రైతన్నని ఆదుకునే ఆపన్న ప్రసన్న హస్తం లేదు- ఇది అందరూ అనుకొనే మాటగా, బుక్కెడు కొర్రలకు సాటిరాని ఓదార్పుగా నడుస్తోంది.

*  *  *

చెప్పాగా... మా వూరు వస్తే పెదకాపింటి కెళ్లాల్సిందే!

రైతుగా రాఘవయ్యగారి అనుభవాలు, జ్ఞాపకాలు ఆయన ముఖతా వినడం నాకిష్టం. నాకది ఆసక్తిగా సాగే తరగతి పాఠం. ఆవిర్లొచ్చినా, మంచు కురిసినా అది జాతి తాలూకు మెట్లదారి!

నేను వెళ్లేసరికి వసారా అరుగుమీద కూచొని దీక్షగా నులక పేన్తున్నాడు పెదకాపు.

ఆ దృశ్యం చూడగానే శివ అప్పుడప్పుడనే మాటలు గుర్తొచ్చాయ్.

"...మా నాయన మనసు బాగోకపోతే, మనసు బెమ్మాండంగా వుంటే నార విచ్చెలు ముందేసుకుని రోసంగా నులక పేనడం మొదలేస్తాడు- ఏవొచ్చినా శివుడు కొండల్లో పడి తాండవమేసినట్టు."

అప్రయత్నంగా వచ్చిన చిన్ననవ్వుని కప్పెట్టి, ఆయన పక్కనే అరుగుమీద కూచున్నా.

ఎప్పుడు వెళ్లినా వేరుశనక్కాయలు చిన్న తాటాకుదొన్నెలో నాకోసం వస్తాయ్.

"తినవయ్యా స్వాములూ... మాయమ్మ నేర్పింది. రోజూ మధ్యాన్నమేళ దోసెడు శనక్కాయలు, కోడిగుడ్డంత బెల్లం..." నా వంకచూసి నాలిక్కరుచుకుని, నవ్వుతూ, "పోన్లే బాదంకాయంత," అని సరిచేసేవాడు.

వెళ్లిన ప్రతిసారీ మాటలూ, మర్యాదలూ అన్నీ ఒక్కలాగే సాగేవి. ప్రేమాభిమానాలు నిండుగా కురిసేవి.

"...ఇదిగో ట్రాకటర్లు దిగాక పొలం పనులు మాకేం మిగల్లేదుగా... చేతినిండా పనిచేసుకునేవాళ్లం గందా... ఆ దురదని ఇట్టా తాళ్లు, తంకర్లు పేనతా తీర్చుకుంటున్నా..."

ఆ మాటల్లో నిష్ఠూరం ఉంది. ఆ గొంతులో నైరాశ్యమూ ఉంది. ధోరణి పసిగట్టి మాటల దారి మళ్లించే ప్రయత్నం చేశా.

"ఏమైనా మీరు చూసినవే గొప్ప రోజులు. రైతులు, పశువులు, ప్రకృతి కూడబలుక్కున్నట్టు కలిసికట్టుగా కాలం వెళ్లదీసేవారు. ఆరుగాలం పొలంపాటు చేస్తూ అందులోనే ఆనందాలు వెతుక్కునేవారు..." అనగానే పెదకాపు, "అందుకు అనుమానమా," అంటూ ఒకసారి జూలు విప్పాడు.

చేతిలో పని పక్కనపెట్టి వైనంగా కూర్చున్నాడు.

“నిజంగానే సామీ... బూమి ఆకాశం మాయంటుండేవి. కార్తెలు ఎప్పటికప్పుడు సేద్యగాడికి పనులు పురమాయించేవి. గొరకొయ్యలు, వేగుచుక్కలు చీకటిపొద్దున మాకు చుక్కానులు.

“వరదగుడి వానరాకడ చెప్పేది. సందమామ దానికి సాచ్చెం. ఇంక పశువులు సరేసరి. సల్లటేళ దుక్కిటెడ్లు మా కష్టసుకాలాలకించేవి. వాటి బరువూ సులువూ యజమానికి చెప్పుకునేవి... అయి మా నమ్మినబంట్లు.”

...ఇంక జ్ఞాపకాల పల్లకీ కదిలింది. విన్నవే అయినా ఆయన తృప్తికోసం ప్రతిసారీ కొత్తగా వింటా. కొన్ని కొత్తవీ వినవస్తాయ్.

ఆయన చెప్పిన కొన్ని అనుభవాల్ని నా డైరీలో నా మాటల్లో రాసుకున్నా. మచ్చుకి వాటిలోంచి ఒకటో అరో చెబితేగాని యీ కథ సాఫీగా నడవదు. అందుకని వాటిని దాటెయ్యలేను. వినండి-

ఏరువాక పున్నమికి ఆడంగులు అరకలకు పసుపుకుంకాలు పెట్టి, కొబ్బరి కాయలు కొట్టి హారతులిచ్చి ఎదుర్రావడం ఓ రివాజు. చెప్పొద్దూ... నాగలి బుజానేసుకెళు తుంటే తీర్థానికి పిలగాణ్ణెత్తుకెళ్తున్నంత సంబరంగా వుండేది. ముందస్తుగా బాగా సత్తవ గల చేలో ఆకుమడికి నేల దున్నడం ఒక ఆనవాయితీ. నిశ్శబ్దపు మసక పొద్దులో ఎద్దుల మెడగంటలు వాటి నడకల ననుసరించి లయ తప్పక చప్పుడు చేసేవి. చేలో దిగాక అరక కట్టి, దుక్కిటెడ్ల ఎలుపు సులువుల్ని సరిచేసే వార్నిపీటని పగ్గంతో బిగించి, చదరాన్నిబట్టి నాగలి పన్నాలి. ఏమాత్రం వంకర టింకర్లు లేని నాగేటిచాళ్లు ఎండుగడ్డకి చక్కిలిగింతలు పెడతాయి. మూడో చాలుకి కోపుగా తేలి కోటేరెత్తుతాయి నాగటిచాళ్లు. మట్టి కుంకంలా మెత్తగా పొడిపొడిలాడుతుంది. పదునైన నాగలికర్రుకి నేలలోపలి తుంగకాయలు తెగి పైకొచ్చి మంచి వాసనలు వెదజల్లేవి. ఇంకా అత్తిపత్తి, గరిక, బొక్కెనాకు, ఉత్తరేణి దుబ్బుల పసరు వాసనలు చెమ్మనేలలోంచి లేచొచ్చి, వేకువ పచ్చిగాలిపై చిలకరించి పలకరించేవి. అన్నీ కలిసి పైకొచ్చే తాజావాసనలు ఇష్టంగా పీల్చాలనిపించేవి. అవి శ్రమని మరిపించేవి.

బారులు తీరిన నాగలిచాళ్లలో ఎక్కడనించో ఒకటొకటిగా వచ్చి గువ్వలు, గోరింకలు వాలేవి. దున్నకంలో బయటపడ్డ వానపాములు, పురుగులు, నత్తగవ్వలు పిట్టలకు పరగడుపున పండగ తెచ్చిపెట్టేవి. వడివడిగా లోతైన చాళ్లలో నడుచుకుంటూ, గిత్తల కాళ్ల మధ్యనించి దూరిపోయే బుల్లిపిట్టలు మేతల్ని వెతుక్కుంటూ సాగిపోతుంటే దున్నేవాడికి చూడముచ్చట. కౌజుపిట్టలు కూతలు వేస్తూ వచ్చి వాలి, నత్తగవ్వల మూతలు పొడిచి పురుగుల్ని మింగేస్తుంటాయి. గడ్డిపూల మీద తూనీగలు ఆత్రంగా కదుల్తుంటాయి.

ఆకాశంలో నిప్పురాజేసినట్టు పొగలా కదిలే మబ్బులవెనక లేతసూరీడు కదుల్తూ కనిపిస్తాడు. తుమ్మచెట్టు కొమ్మల్లోంచి మొలిచే ప్రతి సూర్యోదయం అందమైన రంగుల

బొమ్మ. ఈ బొమ్మకి ప్రాణం వుంటుంది. వొళ్లు విరుచుకొనే కొంగలు, తుమ్మముళ్లకు దారాలు పోసే సాలీళ్లు, తిండికి దండుగా కదిలే గండుచీమలు, తుమ్మకొమ్మలో చిక్కడిపోయిన బూరుగుపత్తి పింజలు... వీటన్నిటితో అప్పుడే నిద్రలేస్తున్న తుమ్మచెట్టు ఆకులు విచ్చుకుంటూ చిక్కపడుతుంది. వీటన్నిటితోపాటు, మూపులమీద వాలి, నడిచే ఎడ్లమీద వయ్యారంగా వుయ్యాలలూగే పికిలిపిట్టల్ని తనివితీరా చూసి తొలి జామున సంబరపడే సౌభాగ్యం ఒక్క సేద్యగాడికే సొంతం.

నాగేటిచాళ్లని సర్రున అడ్డంగా దాటలేక, ఎత్తుపల్లాల్లో నడుముని వంచి వంచి మెల్లగా సాగే తాచుపాము పడగ ఎత్తదు. అమాంతంగా నిగిడ్చిన రెక్కలతో ఆకాశం మీంచి ఒక డేగ కిందికి రయ్యిన నేలకి దిగి, పాముని ముక్కున కరుచుకుని రెప్ప పాటులో పైకి లేస్తుంది. ప్రాణభయంతో మెలికలు తిరుగుతూ గిజగిజలాడే త్రాచుని ముక్కుతో, గద్దగోర్లతో వొడిసి పడుతుంది.

అమ్మో...! ఈ దృశ్యం కంటపడగానే చేతి పగ్గాలు జారిపడతాయ్.

చుట్టూ వున్న పిట్టలొక్కసారిగా ఎగిరిపోతాయ్.

నిలువుగుడ్లు పడ్డ కళ్లు అలాగే చూస్తుండిపోతాయ్. ఎర్రగా వెలుగుతున్న ముళ్లతుమ్మ వెనకనించి ఎగురుతున్న పాము డేగల బొమ్మ భయంగా, క్రూరంగా, జాలిగా తోస్తుంది. ఇద్దరు వస్తాదులు ఎగురుతా కుస్తీ పడుతున్నట్టుంటుంది. పాము జారిపోకుండా కాళ్లని బిగపట్టి వుంచి, కష్టంగా రెక్కలు ఆడిస్తూ నిట్టనిలువుగా గద్ద పైకి లేస్తుంది. డేగ పాముల పెనుగులాట తాటిమొవ్వుకి చేరుతుంది. ఒక్కసారి నిలువెత్తుతాడి మొదలంటా ఊగుతుంది. తాడి మెడకు కట్టిన కల్లుకుండలు తొణికి, నురగని మానుమీద కక్కుతాయి. తాటాకులు చప్పుడు చేస్తూ కదుల్తాయి. బిత్తర పోయిన గుడ్లగూబ తాటిమట్టమీద నిలబడి ఆవలిస్తుంది. తేనెపట్టు రొదచేస్తూ లేచి తాడితల చుట్టూ ముసురుకుంటుంది. మొవ్వులోంచి ఉడతలు, తొండలు తత్తరపడి తోచినవైపు దూకేస్తాయి. పాము కడవూపిరితో బాధగా, కసిగా బుసలుకొడుతూ దిక్కు తోచక రంపాల్లాంటి తాటి గరిమట్టలకు గట్టిగా చుట్టుకుంటుంది. దాని బతుకు పెనం మీంచి పొయిలో పడ్డట్టవుతుంది. గోళ్లతో అదిమిపట్టి డేగ దాని ఇనపముక్కుతో తెచ్చుకున్న మేతని సన్నసన్నని పోగులుగా చీల్చి తినడం మొదలుపెడుతుంది. ఇహ కాకులగోల వినలేం.

ఈ సన్నివేశం జరిగి, విని ఎన్నాళ్లైనా గుర్తొచ్చినపుడల్లా వొళ్లు జలదరిస్తుంది.

ఇలాంటి అపురూపమైన అనుభవాల్ని గుర్తు రాసుకున్నాను.

ఆ పుటల్ని ఎప్పుడు తిరగేసినా నాకు చోద్యంగానే తోస్తాయ్.

ప్రతిసారి మనసు గగుర్పొడుస్తుంది.

* * *

ప్రకృతి దయాదాక్షిణ్యాలకు, దాష్టీకాలకు మధ్య పొంతన కరువైంది. కర్షకులకు సేద్యం మీద ఆశ, నమ్మకం తగ్గాయి. మనసులో భయం పట్టుకుంది. పల్లెపట్టుల్ని నైరాశ్యం పొగల్లే కమ్ముకుంది.

గుడి గాలిగోపురం మీద రావిమొక్కలు ఏపుగా పెరిగాయి. గోపుర కలశాలు కిలుం పట్టాయి. ధ్వజస్తంభపు ఠీవి తగ్గింది. కోవెల కొలనులో పూడిక దిగింది. శాలలో స్వామివారి వాహనాలు రంగులు హంగులు లేక దీనంగా పడివున్నాయి. ఇత్తడి కొమ్మలతో, ఆకులతో, ప్రమిదలతో, పసిడికాంతులతో వెలిగే దీపంచెట్టు భక్తిగా పలకరించే వారు లేక బూజులోడుతూ ఓ మూలకు చేరింది. భజనమండలికి చిందేసే ఓపిక, తీరిక కొరవడింది. దీప ధూప నైవేద్యాలు, రోజువారీ పూజలు, సేవలు యథావిధిగానే సాగుతూనే వున్నాయ్. అమ్మ, నాన్న ఏవేళకావేళ భక్తిశ్రద్ధలతో ఆలయమర్యాదలకి, సంప్రదాయాలకి లోటురాకుండా చూసుకుంటున్నారు. బయటి చేతులు చేసే గంట చప్పుళ్లు వినిపించడం తగ్గిపోయింది. శ్రీవారికి కాగడాలు పట్టేవారు, పల్లకీలు మోసే వారు, మేళం చేసేవారు కనిపించడం మానేశారు. ఉత్సవాలు లేవు, ఊరేగింపులు లేవు. మిరాసీదారులకు కొలగారాలు లేవు. వేరే పనుల్లో వేరేచోట కుదురుకున్నవారు కొందరైతే, ఈ కంచిగరుడ సేవ యెన్నాళ్లు చేస్తామని మొహం చాటేసినవారు మరి కొందరు.

కృష్ణస్వామి ఒకనాటి గుడి వైభవాన్ని తలుచుకొని బాధపడేవారు.

"మన శక్తి కొద్దీ మనం చేయకలిగింది చేద్దాం. మన ఇంటికి మనం చేసుకోమా... గుడిమాన్యాలు, మడిమాన్యాలు పండలేదని దేవళానికి తక్కువ చేయడం దేనికి..." అంటూ నేను, వల్లి రకరకాలుగా చెప్పి చూశాం.

విని, తల పంకించేవారు.

మొన్నామధ్య మళ్లీ యీ ప్రస్తావన వచ్చినపుడు- "మన వేణుగోపాలస్వామి ఆలయం మన ఊరికి చూపుటద్దం. గుడికి వైభవం మన వాడజనంలోంచి రావాలి. వూరి కష్టసుఖాలు దేవుడివి. ఊరివారి అప్పులు, అవమానాలు గుడిమీది నీడలు. శాయంగల విన్నపాలన్నీ చేశాం. మొక్కంగల మొక్కులన్నీ మొక్కాం. ఎందుకో నా స్వామి పరాకు చిత్తగిస్తున్నాడు..." అని నాన్న ఉత్తరీయపు కొంగుతో కళ్లొత్తుకున్నారు.

ఇక తర్వాత వాదించడానికి మేం సాహసించలేదు.

* * *

పెదకాపు దొడ్లో పెద్ద గోరింట పొద ఉంది.

వల్లికి మనసైనప్పుడల్లా గోరింటాకు కోసం వెళ్లేవాళ్లం.

"దానికి ముళ్లుంటాయ్, మీరాగండి... నే కోయించి పంపుతా"నని పెదకాపు దంపతులు అడ్డంపడేవారు.

"ఔను... ముళ్లు గుచ్చుకోందే గోరింట పండదట..." అని నవ్వుతూ మేం పనిలో పడేవాళ్లం.

వచ్చి వాళ్లిద్దరూ నాలుగు చేతులు వేసేవారు.

మొన్నోసారి ఆకు దూస్తూ బోలెడు పాతకబుర్లు అడిగి చెప్పించుకు విన్నాం.

నేను ప్రస్తావన మార్చి, "పెద్దస్వామి తెగ చెబుతాడు- మా రాఘవయ్య గొంతిప్పి పాడితే పద్యాలు కీర్తనలు వినాల్సిందే అని వూరిస్తాడు. మాకో పాట, పద్యం వినిపించ కూడదూ," అన్నాను, చనువుగా.

"ఎందుకు కూడదు మాదవయ్యా... కాని, ఇక్కడా?... దానికి సేలగట్లుండాలి. చుట్టూ మన గొంతుని మారుమోగించే తాటికర వుండాల. చేత పగ్గపు తాళ్లు, ములుగర్ర ఉండాల. మద్దె మద్దె 'ఛోఛో... హైహై...' అంటా ఎడ్లని అదిలిస్తా, అవి మాటినకపోతే రెండు బూతుకూతలు కూస్తా- అప్పుడు 'చెల్లియో చెల్లకో...' అందుకుంటే... అదీ సోకు! నా సామిరంగా నోటికక్కు అణిగిపోద్ది."

ఆ మాటలకి వల్లి గలగలా నవ్వింది.

పెదకాపు వుత్సాహంగా, "నీ మావగారికి 'రాధని రమ్మన్నాడూ మాధవదేవుడు... గోపాలుడూ రాధని రమ్మన్నాడూ...' భజన కీర్తనంటే అబ్బో!... శానా ఇష్టం. ఆ పాట కోసం పాలవఁల్లా వచ్చి మరీ పాడించుకు చిందులేస్తా వినేవాడు," తన్మయత్వంతో చెప్పాడు రాఘవయ్య.

చల్లటివేళ కబుర్లతో మా మనసులు నిండాయి.

వల్లి నడికట్టుగా చుట్టిన పైకొంగు గోరింటాకుతో నిండింది.

బయలుదేరుతుంటే ఇంటావిడ వల్లికి బొట్టిచ్చింది. చిన్ని మల్లెచెండిస్తూ, "అమ్మడూ! రుబ్బేతప్పుడు బొటినేలంత 'కాకిబొడ్డు' యేశావంటే వర్రగా పండి తెల్లారే తలికి మీ అత్తాకోడళ్లయి పగడాల దోసిళ్లవుతాయ్," అంది నవ్వుతూ.

వల్లి తెలుసన్నట్లు తలూపింది.

వెళ్తున్న వల్లి ఆగి, ఏదో గుర్తొచ్చినట్టు, "... ఉలవచారు చాలా బావుంటుందిట... ఎలా చేస్తారో...?" అంది.

ఆవిడ వులిక్కిపడి ఆయనకేసి చూసింది.

"ఆ మాట మా ఇంటో వినిపించకూడదు," ముక్తసరిగా అన్నాడు రాఘవయ్య.

నేను, వల్లి తప్పుచేసినవాళ్లలా చూశాం.

అది గమనించి-

"చెబుతా... మాయమ్మ మాటల్లోనే చెబుతా... ఎందుకంటే రోజూ ఓపాలి ఎచ్చరిక చేసేది... ఇనండి.

'తొలిచూలు బిడ్డ... నీ అన్న ఎట్టుండేవాడు... దొరబాబు. ఆ ఏడు గాలిపాటు బావుంది. మెరకచేలో ఉలవ విరగపండింది. కళ్లంలో నిలువెత్తు రాశి పడింది. నాలుగేళ్ల

పిలగాడు కళ్లంలో కోడెదూడతో ఆడుతున్నాడు. మీ నాయన ముద్దుచేస్తా వాడిని ఎత్తుకుని ఉలవలరాశి మీద కూసోపెట్టాడు... ఆయన పనిలో ఆయన పడ్డాడు. కూసేపటికి బిడ్డ కనిపించలా. చుట్టుపక్కల చూస్తే లేడు. రాశిమీద ఆడతా ఆడతా నా బిడ్డ ఉలవల్లో కూరుకుపోయాడు.

'ఉలవలు అల్పంగా ఉంటాయి గందా... కాలు తీసి కాలేస్తుంటే పిల్లడు ఊబిలోకి దిగడ్డట్టు రాశిలో కెళ్లిపోయాడు. అంతా వెతికాం. చివరికి ఉలవల్లో ఊపిరి లేని కట్టె దొరికింది. ఉలవగింజ నా ఇంటికి రాకూడదని మీ నాయన ఆ రాశిని అక్కడే వదిలేశాడు. చేతులారా నా బిడ్డని నేనే పాతేశానని మీ నాయన పొగిలి పొగిలి ఏడ్చాడు. వద్దు నాయనా అవి మనకి అచ్చిరావు... వద్దు నాయనా,' అంటా తలుచుకు తలుచుకు ఏడ్చేది మా యమ్మ."

ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అందరి కళ్లూ చెమర్చాయి. తడి కళ్లతోనే వెళ్లొస్తామని చెప్పి బయలుదేరాం మేమిద్దరం.

"...అట్లా జరుగుతుందా?" అని దారిలో సందేహంగా అడిగింది వల్లి..

"ఆ(... జరుగుతుంది. ఉలవలు పట్టురేకుల్లా వెడల్పుగా ఉంటాయ్. అలాగే కూరుకుపోతారు. కావాలంటే ఓ పెద్దగిన్నె నిండా ఉలవలు పోసి అందులో బల్లిని వదిలి చూడు. నేను ఎన్నోసార్లు విన్నా కాబట్టి నాకు వింత కాదు," అని చెప్పా.

సాయంపొద్దులో కొంగలు గూళ్లకు చేరుతున్నాయ్. కొమ్మలమీది గూళ్లలో పిట్టల కిచకిచలు వినిపిస్తున్నాయ్. రాజగోపురం దగ్గర పడిచూపులతో మా కోసమే నిలబడ్డారు నాన్న.

వల్లి కళ్లలో సంతోషాన్ని, ఒడినిండా గోరింటాకుని గమనించి, "చూడు తల్లీ! గోరింటాకు మనకి మనమే కోసుకోవాలి. పెట్టుకొనే చేతులే రుబ్బుకోవాలి. నలుగురితో కూడి అలంకరించుకోవాలి. పండువెన్నెట్లో అదో ఉత్సవంలా సాగితే, అరుగుమీద ముచ్చట్లు పండుతాయ్. ఆనక చేతులూ పండుతాయ్ ముచ్చటగా..." అంటూ నాన్న ఇంటికి నడిపించారు.

అమ్మ ఎదురొచ్చి గోరింటాకు అందుకుని మురిసిపోయింది.

* * *

సాంబశివరావుకి కల్యాణఘడియలు ముంచుకొచ్చాయి.

"కృష్ణస్వామీ! చేతిలో చిల్లిగవ్వ లేదు. అప్పు పుట్టే ఇరువు లేదు... ఏం చేద్దాం?" అంటూ మంతనాలు సాగించాడు పెదకాపు.

లౌక్యం ఉపయోగించాడు పెదస్వామి.

దేవుణ్ణి అడ్డుపెట్టుకున్నారు.

'అబ్బాయికి మొక్కుంది. పెళ్లి మా గుళ్లోనే జరగా,'లని తెలియచెప్పారు- అమ్మాయి వాళ్లకి.

“అందుచేత మీరంతా తరలి వస్తే స్వామి సన్నిధిలో దివ్యంగా తలంబ్రాలు పోయిద్దాం...” అన్నారు కృష్ణస్వామి.

“అవితే... పిల్ల పెళ్లిఖర్చులకుంచిన పైకం వోల్మొత్తం మీ చేతిలో పెడతాం. మాకు మాట రాకోకుండా చూస్కోండి,” అన్నారు పెళ్లికూతురువాళ్లు.

పెదకాపు దంపతులు హాయిగా శ్వాస పీల్చుకున్నారు.

ఆట్టే వ్యవధి లేకుండానే పెళ్లి ముహూర్తం కుదిరింది.

‘అట్లాంటా’ నించి శివ తోబుట్టువు చిట్టెమ్మ పెళ్లికి వచ్చింది.

బావయ్యకి సెలవ లేదంది. పిల్లకి స్కూలుందంట.

అంత పెళ్లిసందట్లోనూ నన్ను చిక్కించుకుని, “మా సాంబయ్య మీ దగ్గర చదువుకుంటే బాగుండేది. వాడికి ఏదో ఒక దారి దొరికేది,” అన్నది చిట్టెమ్మ.

“పర్వాలేదులే, ఇప్పుడు నాన్నకి శివ ఆసరా ముఖ్యం. దారి అదే దొరుకుతుంది,” అని సర్ది చెప్పాను.

అమ్మనాన్నలతో పాటు నేను, వల్లి కూడా శివ పెళ్లికి పూర్తిగా పూనుకున్నాం. తోరణంమండలు కట్టే దగ్గర్నించి వంటావార్పూ అజమాయిషీ దాకా, గరిటలు, గంగాళాలు సైతం మేమే అయాం.

ఏ లోటూ తెలియకుండా పెళ్లి జరిగింది.

‘మీరంతా నిలబడి నా పెళ్లి బెమ్మాండంగా చేపించా,’రని శివ తెగ సంబరపడ్డాడు.

‘మా కృష్ణస్వామి మాపాలి దేవుడు. చక్రం అడ్డేసి నామాట దక్కించా,’డని పెదకాపు దణ్ణాలు దణ్ణాలు పెట్టాడు.

లోగుట్టు పెరుమాళ్ల కెరుక!

* * *

నేను మళ్లీ వచ్చేసరికి కొత్త పెళ్లికొడుకు పాతబడ్డాడు.

కొంచెం అగ్గితీరి బావున్నాడు..

“కష్టసుఖాలు ఓర్చే పిల్ల. అమ్మాయి యోగ్యురాలు,” అంటూ వనమ్మకి యోగ్యతాపత్రం యిచ్చారు అమ్మ, నాన్న.

నేనీమాట చెప్పగానే, “ఓర్చక చస్తదా... ఏట్లో పడ్డాక ఈదకపోతే ఇంతే సంగతులు,” అన్నాడు శివ.

శివ కళ్లలోకి చూశాను.

“ఏ మాట కామాటే చెప్పకోవాలి, పాపం వనమ్మ మంచిదేనండీ,” అని, స్వరం మార్చి, “రేపటి రోజు బెమ్మాండంగా ఉంటదని ఈరోజున హాయిగా నవ్వే రకం,” అన్నాడు.

శివ మాటల్లో ప్రేమ, అభిమానం తొణికాయి.

ఓ క్షణం ఆగి, ఎటో చూస్తూ, "ఈ టయింలో వనమ్మ లేకపోతే చచ్చిపోయే వాణ్ణి... నిజం చెబుతున్నా చినసామీ," శివ గొంతు జీరపోయింది.

శివ వెన్నుతట్టి సముదాయించాను.

మిత్రుడికి అనుకూలవతి దొరికినందుకు ఆనందపడ్డాను.

శివ తేరుకుని, "పేరుకి పెదకాపు," అంటూ పెదవి విరిచి, "ఉన్నది పన్నెండు ఎకరాలు. అందులో మూడెకరాలు అక్కకి కట్నం కింద ఇచ్చాం గందా. ఇహపోతే మిగిలింది తొమ్మిది," అంటూ అంకెని వత్తి పలికాడు. "అంతా పోయి పెదకాపు బిరుదు మాత్రం మిగిలింది..."

శివ మాటల్ని అడ్డుకుని నేనేదో అనబోతుండగా, వెనకనించి కృష్ణస్వామి గొంతు ఖంగుమంది.

"వున్నా పోయినా మాట తప్పనివాడు కనక పెదకాపు అయాడు. ఏళ్ల తరబడి గొడ్డుచాకిరీ చేసిన దుక్కిటెడ్లని శక్తి వుడిగిపోగానే నిర్దయగా వదిలేయకుండా, వాటి 'అఱ్ఱు' కడిగి పోషించాడు. పాలతో అఱ్ఱులు కడిగాక, యిక కాడికి స్వస్తి. అవి ఉన్న న్నాళ్లూ చలవ తాటాకు పందిళ్ల కింద, ఎండుగడ్డి పరుపుల మీద లేతపచ్చికలు నెమరేస్తూ కాపుని దీవిస్తూ కాలం వెళ్లబుచ్చాయ్. అందుకని పెదకాపు!

"పొలం పనులు లేని తరుణంలో ఇంటి దగ్గర రైతు చెయ్యాల్సిన పనులు ఒక పూజల్లే చేసేవాడు. నారతో తాళ్లు వేస్తే మా రాఘవయ్యే వెయ్యాలి. బండి మోకులు, పగ్గపుతాళ్లు, పలుపుతాళ్లు, కృష్ణాష్టమి ఉట్టితాళ్లు, చేంతాళ్లు, కవ్వపుతాళ్లు, సిగమార్లు... ఇంకా నులక సంగతి చెప్పనే వద్దు, చూస్తున్నావుగా... యిప్పటికీ.

"మాధవా! నువ్ చూశావో లేదో... వాళ్లింట్లో రాగుల మంచం వుండేది. అది పేనిన నులకతో చిక్కగా అల్లిన నులకమంచం. దానిమీద ఆపళంగా రాగులు ఎండ పోసుకోవచ్చు. ఒక్క గింజ కిందికి జారదు... అదీ పనితనం! దానికి మెట్టగోగుల నార వుండాలి. రాఘవయ్యలాంటి సిద్ధహస్తుడు జతపడాలి.

"శివయ్యా! మరే... అందుకని మా రాఘవయ్య పెదకాపుగా మిగిలాడు... తెలిసిందా?" అంటూ ముగించి, 'నారదాదిమునిబృంద వందితం...' గొణుక్కుంటూ వెళ్లిపోయాడు కృష్ణస్వామి.

ఉలికిపడిన శివ తేరుకోడానికి సమయం పట్టింది. పెదస్వామి వెళ్లేదాకా పొన్న మాను చాటున నక్కాడు.

నాకు నవ్వొచ్చింది.

"బాబోయ్! ఇక్కడ వాహనాలకి చెవులున్నాయ్ మాధవయ్యా... నోరు దగ్గర పెట్టుకోవాల," అన్నాడు శివ కొంటెనవ్వుకి హీనస్వరం జతచేసి.

* * *

ఉన్నట్టుండి మా వూరికి అరగంట దూరంలో మెయిన్‌రోడ్డు హద్దుగా సందడి మొదలైంది. వాకబు చేస్తే అక్కడో పెద్ద కార్పొరేట్ కాలేజి తయారవుతోందన్నారు. ఏకంగా వందెకరాల మాగాణి కొనేసి మెరక చేశారు. ముందువైపు కాలేజి భవనాలకు, వెనకాల హాస్టల్ బిల్డింగ్స్‌కి పునాదులు వేస్తున్నారు. అక్కడ పగలూరాత్రీ తేడా తెలియడం లేదు. ఎన్నడూ చూడని భారీయంత్రాలు పనిలో దిగాయి. ఏడాదిలో భవనాలు సిద్ధం కావాలిట! మరో సగంలో ప్రకృతి సేద్యం మొదలైంది. కూరలమళ్లు, పళ్లతోటలు సిద్ధం అవుతున్నాయ్. మంచి జాతి ఆవులు, గేదెలతో డెయిరీఫాం కావల్సిన హంగులు సమకూర్చుకుంటోంది.

"మీ పిల్లలకు మందులెరగని దంపుడుబియ్యం, తాజాపళ్లు, కూరలు, పప్పులు, స్వచ్ఛమైన ఆవునెయ్యి, పాలు, కమ్మటి పైరగాలితోబాటు క్రమశిక్షణతో కూడిన అత్యుత్తమ విద్య ఇవ్వడమే మా లక్ష్యం! (మినరల్ వాటర్ ప్లాంట్ కూడా కలదు)"- ఈ సమాచారంతో, ఇంకా బోలెడు వివరాలు, ఫోన్ నెంబర్లతో పెద్ద పెద్ద బోర్డులు ఒకటికి నాలుగుచోట్ల పెట్టారు. కావాలనుకుంటే పేరెంట్సు, గ్రాండ్ పేరెంట్సు వచ్చి పిల్లలతో నాల్రోజులు గడిపి వెళ్లడానికి తగిన వసతి వుందిట. సువిశాలమైన ఆట స్థలంట! అవసరమైనపుడు హెలికాప్టర్ అక్కడ దిగుతుందిట. కొంతమంది లెక్చరర్లు హెలికాప్టర్లలో తిరుగుతూ రోజూ రెండుమూడు దూరపు కాలేజీలు కవర్ చేస్తారట! 'విశేషాలు వినవలె వింతవింతలు' అన్నట్టు కావల్సినన్ని కబుర్లు అక్కడి జనంమీద సంచారం చేస్తున్నాయ్.

కొన్నేళ్లుగా స్తబ్దత అలుముకున్నచోట ఒక కదలిక వచ్చింది.

* * *

అరుగుమీద కూచుని తాటిపండు టెంక చీకుతూ మైమరిచి ఉన్నాడు పెదకాపు. చేరపిలిచి అరుగుమీద నాకు చోటిచ్చాడు.

"మీరు తినరుగాని సాములూ, రుచంటే తాటిపండుదే రుచి. మూడు ముంజలూ ముదిరి మూడు టెంకలవుతాయ్. చెట్టున పండి రాలాక దాన్ని పద్ధతిగా కాల్చి... ఇదిగో ఇట్టా తింటుంటే ఉంటదీ... చెప్పలేను. మామిడిపండు తింటే ఆ మజా తింటున్నంత సేపే. తాటిపండు రుచి ఆ రోజంతా మనల్ని తరిమిద్ది."

నేను అయోమయంగా చూశాను.

"ఇను, తాటిపీచులు పళ్లకి అంగిడికి ఇంకా గొంతుదాకా సుట్టుకుంటాయ్. అవి ఒక్కొక్కటీ చిక్కులు వదిలించుకు నాలిక మీదకు వస్తా వుంటాయ్. ఇహ వాటి తీపే తీపి... చిన్నప్పుడు తాటిచెట్లెక్కి దాని తల్లోనే కూకుని ముంజకాయలు కోసుకు తిన్నవి గుర్తొస్తాయ్. దూడలమీద పోతా చెరుకు నవుల్తా చెర్లో సావాసగాళ్లతో తిరుగాడి నట్టు అనిపిస్తది. మీకు ప్రాప్తం లేదు... ప్చ్," అని నవ్వుకుంటూ వెళ్లి ముఖమంతా పట్టిన తాటిగుజ్జుని వదిలించుకు వచ్చి కూచున్నాడు రాఘవయ్య.

పక్కనే ఆనించి పెట్టిన అరకని తీసి దాని తల తన ఒళ్లో పెట్టుకున్నాడు. నేను కళ్లు విప్పార్చి చూస్తూ కూర్చున్నాను.

పక్కనే మంచి గుమ్మడిపండు తొడిమెమూతతో వున్న చిన్న నూనెసీసా అందుకున్నాడు. అందులోంచి ఏకుని ముంచి తీశాడు.

"ఇది అవిశనూనె. నాగలిదుంపకి అప్పుడప్పుడు రాస్తా ఉండాల. ఇదిగో ఈ చివర బిగించిన 'కఱ్ఱు' తుప్పట్టకుండా దీనికీ రాయాలి," అంటూ ఆ పని వైనంగా పూర్తిచేసి నాగలిని బుజంమీద వేసుకు తీసికెళ్లి పక్కనున్న గోడకి అమర్చాడు.

దానితో పని తీరిపోయినా ఆ రైతుకున్న శ్రద్ధ, మమకారం నన్ను ముగ్ధుణ్ణి చేశాయి.

నూనెచేతులు పాదాలకు రాసుకుంటూ, "ఇంకేంటి సామీ సంగతులు," అన్నాడు చనువుగా.

ఏం లేవంటూనే, "దీన్ని ఏ కొయ్యతో చేస్తా,"రన్నాను ఆసక్తిగా.

"సాజెంగా తుమ్మకఱ్ఱతో చేస్తారు."

నా వంక చూసి, నాలికకి దొరికిన తాటిపీచుని చప్పరిస్తూ, "నాగలి దుంపంటే బజార్లోనో సంతలోనో దొరికేది కాదు. దీని కత చెబుతా... విను," అని మొదలుపెట్టాడు.

"అబ్బో! ముందసలు దుంపకి దుంగ దొరకాల. పుల్‌గా చేవపట్టి ఉండాలి. పది జానల తుమ్మమొద్దుని నాలుగు అమావాశ్యల పాటు నీళ్లలో ఊరెయ్యాలి. దాన్ని బయటకు తీసి ఓ నెలపాటు ఎండలో పడెయ్యాలి. పై బెరడు సుబ్రంగా వొలవాల. అప్పుడు బెమ్మం బాబాయ్ దాన్ని తట్టి, తిప్పి అన్ని దిశల్నించీ చూసి, మాంఛి లగ్గం పెట్టి పనిలోకి దిగుతాడన్నమాట. అబ్బో! అదో పెద్ద అంగామా," అంటూ ఊపిరి పీల్చుకుని నావైపు చూశాడు.

నా కళ్లు చెప్పమన్నట్టు చూశాయ్.

మళ్లీ కథ మొదలైంది.

"బెమ్మంగారి చూపులు తీవ్రంగా ఉండేవి. పిట్టలా గుప్పెడు మడిసి. గావంచా, కాసంత కుంకం బొట్టు, మెడలో వేలాడే పెద్ద రుద్రాచ్చ, చిన్న లింగంరాయితో ఉండే బెమ్మంగారిని, 'నువ్ మాంత్రికుడల్లే ఉంటావ్ బాబాయ్,' అంటే, 'ఔనౌను మాంత్రికుణ్ణే. నాగలిదుంపని చెక్కడమంటే మాటలా... ఓ దేవుణ్ని చెక్కడమే,' అనేవాడు.

"దుంగకి ఓ పక్కగా నిలబడి పెదబాడిసతో ఆయన చెక్కడం చిత్రంగా ఉండేది. ఎక్కడా కొలతలు, గీతలు ఉండవ్. బాబాయ్ మనసులో, కళ్లలో ఉంటాయంతే! రోజూ పొద్దుటిపూట వాలెండలో ఓ గంటసేపు మాత్రమే ఈ పనిలో ఉండేవాడు.

“ఆ అరక ఆసామి అది పూర్తయే నెల్రోజులూ ఫ్లాస్కో నిండా కాఫీ తీసికెళ్లాలి. ఆరారగా కాఫీ తాగడం బెమ్మంగారికి అలవాటు.

“రోజూ పొద్దున్నే ఎల్లేవాణ్ణి.

“సొంతగాడు శద్ధ చూపించకపోతే బాబాయ్‌కి సెడ్డ కోపం వచ్చేది. నెల్రోజులకి పెదబాడిస పని పూర్తయింది. చినబాడిసతో, చిత్రిగ్గుల్లతో సవరింపులు చేశాడు.

“‘ఉక్కుముక్కలా ఉంది కాపూ... అంతా చేవే,’ అని మెచ్చుకున్నాడు. నాగలి దుంపని పదిసార్లు తడిమి చూసి, చేత సరిగ్గానే ఉందనుకున్నాడు. ‘కుదిరిగ్గా వచ్చిందిలే.... ఏట్లో సొరశాపల్లే నేల్లో దూసుకుపోతంది రాగవా,’ అన్నాడు.

“‘అంతా నీ పనితనం మయిమ బాబాయ్,’ అంటే-

“‘నాదేవుంది... అది తుమ్మమానులో నీ కోసం కూకునుంది... దాన్ని సుతారంగా బయటకు లాగా... అంతే!’ అన్నాడు, లోపల మురిసిపోతానే.

“మిగతా నిలువుపీట, మేడి ఒఖ్ఖపూటలో సిద్ధం చేశాడు. కొలిమి పెట్టి ఉక్కు కర్రు పోత పోశాడు. దానికి ‘వాయ’ పెట్టాడు. పదునుతో బుసలు కొడుతున్న కర్రుని దుంపకొనకి ఇనపకట్టుతో గట్టిగా బిగించాడు. మళ్లీ ఒకసారి తడిమి చూసుకున్నాడు. కొత్త నాగలికి పసుపుకుంఖాలు పెట్టి నా బుజానికెత్తాడు బాబాయ్.

“‘వేయి ఏరువాకల పాటు మీ క్షేత్రాలు దున్ని, బంగారు పంటలు పండించాలి,’ అరకతో నించున్న నన్ను వెన్నుతట్టి దీవించాడు.

“చకునం చూసి సాగనంపాడు... నాకు బాగా గుర్తు... యింకా కళ్ల ముందుంది.

“ఓ బస్తా గింజలు పంపితే తీసుకునేవాడు. లేదంటే అడిగేవాడు కాదు.

“అదయాక ఊరిబావి కాడో, పోతరాజు గుడిమూలో ఓమాట వినిపించిందంట. ‘బెమ్మం అసాజ్జుడు. పని ఓ పట్టాన తెవల్చడు. నెల్రోజులు చెక్కుళ్లు పెడతాడు. ఇంకో పదిరోజులు నగిషీలు పడతాడు. ఊళ్లో పది దుంపలు చాలు, బాబాయ్‌కి ఏడాదిపాటు కాఫీకి కొరవుండదు...’

“ఎందుకనో బాబాయ్ ఈ మాటల్ని ఆషామాషీగా తీసుకోలేదు. పైగా విన్న వాళ్లు నవ్వడమేంటని రోసపడ్డాడు. లోకుల కాపీనీళ్ల కోసం కక్కుర్తిపడే బతుకా... ఈ క్షణం నించి పెదబాడిస వదిలేస్తున్నానని శపది చేశాడు.

“తర్వాత ఎవరెంత బతిమాలినా, లెంపలేసుకున్నా ఆయన మళ్లీ పెదబాడిస చేతపట్టలేదు.

“ఇదిగో ఇప్పుడిదే మనూరి బెమ్మంగారు చెక్కిన ఆకరి నాగలిదుంప. అది సామీ దీని కత.”

అంతా విన్నాక నాకు దాన్నొకసారి తాకాలనిపించింది. రెండు చేతులతో దాన్ని అద్దుకున్నాను.

తాటిపీచుని పళ్లసందు నించి వేలితో లాక్కున్నాడు. తీపి తగిలి పెదకాపు జిహ్వ లేచొచ్చినట్లు నాకాయన కళ్లు చెప్పాయి!

* * *

మధ్యాన్నం లంచ్ అవర్‌లో సాంబశివరావ్ నా కోసం మా కాలేజికి వచ్చాడు.

చాలా రోజుల తర్వాత ప్యాంటు షర్టులో కనిపించాడు.

"ఏమిటి విశేషం..." అన్నాను.

"ఇక్కడ మనకి కొంచెం పైకం రావల్సుంటే వచ్చా."

ఎంతకీ తరగని వరండాల్లోంచి నేను, శివ నడుస్తున్నాం.

కాలేజీ పాతజ్ఞాపకాల్ని గుర్తు రాకుండా శివ అణిచేసుకుంటున్నట్టు అతని వాలకంబట్టి నాకర్థమవుతోంది.

వెళ్లి ఇద్దరం మా ఫిజిక్స్ లాబ్‌లో కూచున్నాం.

"మూలపడ్డ ఎడ్లబండి అమ్ముడుపోయింది. ఇక్కడి బార్ అండ్ రెస్టారెంటోళ్లు మంచి రేటిచ్చి తీసుకున్నారు. మన బండి చేతాళం బావుంటదిలే..."

"వాళ్లకెందుకో..." అన్నాను.

"ఇక్కడాళ్లెవరో మామిడితోపులో బెమ్మాండమైన బార్ పెడుతున్నారంట. ఆపిన బళ్లమీద కూకోబెట్టి మందు తాపిత్తారేమో!" నవ్వుతూ అని, "బోకర్లు ఇట్టాంటాటికోసం వూళ్ల మీద పడ్డారు. చూరునీళ్లతో ఏనుగు దాహం తీరుద్దా... అయినా కరువురోజుల్లో అనుకోకుండా కూసిని డబ్బులొచ్చాయ్..." అంటూ జేబులోంచి కొత్త సెల్‌ఫోన్ తీసి చూపించాడు.

ఫోన్ చేతిలోకి తీసుకుని చూస్తున్నా.

"మనకిది చాల్లెండి... ఆకరికి మా వనమ్మ కూడా పుట్టింటినించి సారెలో తెచ్చుకుంది. కాని, అప్పులాళ్లకి దీనివల్ల నిండా దొరికిపోతాం," నవ్వుతూ అన్నాడు శివ.

"ఫోన్ లేదంటే ఎవరూ నమ్మడంలా... అందుకే తీశా."

"నీకు ఉండాల్లే శివా..."

"ఎందుకండీ...? మీతో తప్ప ఇంకెవరితోనూ మనకి మాట్లాడ్డం అసలు రాను కూడా రాదు," అని నవ్వుతూ, "మా వనమ్మ పుట్టింటికి లైను కలిపిందంటే బెమ్మంగారి నాటకమంతసేపు మాటలు నడుస్తానే వుంటాయ్. ఇసుకుండదు... ఇంటర్రెల్లుండదు," అన్నాడు.

అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు, "పెదకాపుకింకా తెలీదు. తెలిస్తే గొడవే! దాన్ని మూలపడేసి పదేళ్లు దాటింది. ఓ పక్కనించి బుగిలిపోతా వుంది. ఆయన అరుగు దిగిరాడు. దిగినా వాములదొడ్డిదాకా పోయి కొష్ఠంలో చూడ్డని తెగించేశా..."

"చెప్పే తీరులో చెబితే ఎందుకు కాదంటార్లే," అన్నాను.

"అమ్మో! పెద్ద రచ్చయిపోయిద్ది... 'అది నీకేం అన్యాయం చేసిందిరా సాంబిగా,' తో మొదలై, 'ఎనిమిది జతల కోడెల్ని ఆ బండి కాడికిందే జత కలిపాన్రా, ఎన్ని పెళ్లిళ్లు చేయించిందిరా, గాదెలకొద్దీ ధాన్యం మనింటికి తోలిందిరా... ఇశ్వాసం ఉండాలిరా...' ఆ బండి పుటక్కాణ్ణించి ఊదరగొట్టి వదుల్తాడు. 'బంగారంలాంటి ఇత్తడిపొన్నుల కాడి కూడా పోయిందా? చిడతలు, వసికఱ్ఱలు కూడా వాళ్లకిచ్చి దండం పెట్టావా...?' ఇది మీ భాషలో చెప్పాగాని, మద్దెమద్దెన బండబూతులు కంకరరాళ్లు పడ్డట్టు పడతాయ్ స్వామీ... లేపోతే 'గద్ద తన్నుకు పోయిందిరోయ్... పడగ చీలింది రోయ్,' అని కలవరిస్తాడు."

"అవన్నీ వాళ్ల జ్ఞాపకాలు శివా... వదులుకోలేరు ఓ పట్టాన."

"గ్యాపకాల్ని దాపెట్టడానికి సావిళ్లు పందిళ్లు అక్కర్లా. చివికిపోయిన బళ్లని, జల్లల్ని అట్టా దాచలేం కదండీ." ఎంత జాగ్రత్తపడ్డా శివ మాటల్లో అసహనం స్పష్టంగా ధ్వనించింది.

కాలేజి గంట మోగింది. శివ చటుక్కున లేచి వస్తానంటూ బయలుదేరాడు.

* * *

మొన్న మొన్నటిదాకా కూర్మావతారంలా కదలిక లేకుండా ఉన్న మాగాణి రెండేళ్లు తిరక్కుండా త్రివిక్రమాకారం దాల్చింది.

బహుళ అంతస్థుల భవనాలతో కార్పొరేట్ కళాశాల సిద్ధమైంది. పెద్ద ఓడ ఎక్కడ్నించో వచ్చి, రాత్రికిరాత్రి పొలాల్లో లంగరేసినట్లుంది. తుదిమెరుగులు దిద్దు కుంటూనే విద్యార్థుల అడ్మిషన్లకి ఆకర్షణీయమైన ప్రకటనలు విడుదల చేస్తోంది.

ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా నడుస్తున్న గొలుసు సంస్థ అవడంతో పనులన్నీ ఓ క్రమంలో సాగిపోతున్నాయ్.

మా కాలేజీ సీనియర్ లెక్చరర్ ద్వారా నాకు కబురొచ్చింది. కొత్తకాలేజీలో చేరేట్టయితే తీసుకుంటారని. జీతం రెండురెట్లు. కాని దాదాపు పదేళ్ల పాతసర్వీసుని ఇక్కడే వదిలెయ్యాలి. ఎవరికెవరు నచ్చకపోయినా నేనే ఉద్యోగం వదిలేసుకోవాల్సి వుంటుంది.

నాన్నని అడిగాను.

"నీ ఇష్టం," అంటూనే-

"ఈ వయసులోనే బతుకుభయం ఉంటే ఎలాగయ్యా. నీ మీద, నీ విద్వత్తు మీద నమ్మకం ఉంటే ఆలోచించవ,"చ్చని సూచించారు. "అయినా నీకీ వయసులో కావల్సింది స్థిరంగా కూర్చునే కుర్చీ కాదు, పైకి నడిపించే నిచ్చెన," అనగానే నాన్న మనసు అర్థమైంది. అన్నిటికంటే నాకు పెద్ద ఆకర్షణ ఊళ్లోనే ఉండి ఉద్యోగం చెయ్యడం. అమ్మ, నాన్న, దేవుడు... నా కూడా ఉంటారు.

అన్ని విషయాలు మాట్లాడుకొని కొత్త కాలేజీలో చేరిపోయా. ఇంటర్ స్టూడెంట్స్‌కి ఎంట్రెన్స్ కోచింగ్ క్లాసులు తీసుకోవాలి. ఫిజిక్సు నా వంతు. దాన్ని భక్ష్యాలుగా, భోజ్యాలుగా, లేహ్యాలుగా, చోష్యాలుగా పిల్లలకు ఎక్కించడం నా గురుతర బాధ్యత.

ఇక్కడి చదువులు వేరు, పద్ధతులు వేరు. పరీక్షా విధానాలు వేరు. ప్యాస్ మార్కులు కాదిక్కడ, ర్యాంకులు. కాలేజివారు అన్నీ యెరుకపరిచారు. కోచింగ్ విధానా లెట్లా ఉంటాయో నాకు క్లాసులు తీసుకుంటున్నారు. మోడల్ పేపర్స్‌ని, బోధన తీరుతెన్నులనీ ఒకటి రెండు నెలలు బాగా స్టడీ చేసుకోమన్నారు.

నేనిప్పుడు మళ్లీ విద్యార్థినయ్యాను.

'మునుపటివలె కాదురా మువ్వగోపాలా,' అంటూ వల్లి నవ్వు పట్టిస్తోంది.

ఇక్కడికి మారడం వల్లికి చాలా ఇష్టం. అయినా బయటపడలేదు. అంతా సూచించేవారేగాని నన్ను శాసించేవారెవరూ లేరు.

అదే నా ఏకైక సమస్య.

* * *

కొత్తకాలేజిలో చేరానని తెలిసి-

"దేవుడు మీ ఎనకమాల ఉంటాడు మాదవయ్యా. మా పెద్దసామి పగలూ రేత్రి దేవుడు దేవుడని కలవరిస్తాడు... నమ్ముతాడు. నీలాంటి బుర్రున్నోళ్లు వాళ్లకి కావాలిగందా." ఒక శ్రేయోభిలాషి ఎట్టా మాట్లాడతాడో అట్లాగే మాట్లాడాడు పెదకాపు.

వేరుశనక్కాయలు, బాదంకాయంత బెల్లంగడ్డ వచ్చాయి.

శివ ఎదురయ్యాడు.

"కారు కొను సామీ, నేను డ్రైవర్‌గా నీ దగ్గరే పడుంటాను," అన్నాడు.

నవ్వానుగానీ, నా మనసు చివుక్కుమంది.

శివ వెళ్లిపోయాక, "చేతులు కాలాక ఆకులు పట్టుకోడమంటే ఇదే... సన్నాసి," అన్నాడు తండ్రి నిట్టూర్పుగా.

నేను శనక్కాయలు కొట్టుకు చప్పుడు చేస్తూ ఆయన మాటల్ని లౌక్యంగా దాటేశాను.

ఆయన దారి మళ్లించే చిట్కా ప్రయోగించా.

"నా చిన్నప్పటి రోజుల్లో మిమ్మల్ని 'తోడాల రాఘవయ్య' అనేవారని గుర్తు. ఆ పేరు ఎట్లా వచ్చిందో?" అనేసరికి ఆయన ముఖం వెలిగిపోయింది. రెండు వేళ్లతో బుర్రమీసాలు దువ్వుకున్నాడు.

"పందాల్లో గెలిచిన ఎడ్లకి బహుమతిగా వెండి కడియాలేస్తారు. అవే తోడాలు. అప్పట్లో నాకు వరసగా తోడాలే తోడాలు...ఆ పేరు అప్పటిదిలే..." అన్నాడు పెదకాపు పాత జ్ఞాపకాల్లో మునకలు వేస్తూ.

“పందెపెడ్లని తయారు చెయ్యడం వేరే కళ... ” అన్నాను పొగడ్తగా.

“కళే మరి... వాటితోపాటు ఉండాల. తగిన దాణాలు పెట్టాలి. తర్ఫీదివ్వడం వేరే తంతు. పందాలకెళ్తున్నామని వాటికి తెలిసేట్టు చెయ్యాల,” అంటూ విలాసంగా నవ్వుకున్నాడు.

నేను కాయలు కొట్టడం ఆపి, ఆయన వంక చూశాను.

“పందాలలో ఎడ్ల సైజునిబట్టి లాగే బరువుంటది. మన పోటీల్లో నాలుగు సైజులుండేవి- ఎత్తుని బట్టి. వెళ్లగానే కొలిచి సైజు ఖాయం చేస్తారు.

“నా జతకు నేనో కంత్రీతనం నేర్పా. కొలతలు తీసేందుకు అరుగు ఎక్కించ గానే, నేను సిగమారు పట్టుకుని రెండోచేత్తో గంగడోలుని మెత్తగా గిల్లేవాణ్ణి. గభాల్న ఎద్దులు ఎనక్కాళ్లు బెత్తెడు ఎనక్కి, ముందుకాళ్లు ముందుకి జరిపి నడుం సాచేవి.” మీసాలు దువ్వుకుని, చిరుగర్వంతో నవ్వి, “రెండోసైజు జత పోయి మూడులో పడేది,” అంటూ ఆగాడు.

మళ్లీ అందుకుని, “ఇంకేవుంది... మనం తర్ఫీదులో రెండు సైజు బరువులు లాగిత్తాంగా. అక్కడ మంచినీళ్లప్రాయంగా లాగి పడేసేవి. పైగా మనమేందంటే దెబ్బ వేయకుండా అదిలింపులతో, నోటికేకతో లాగించేవాళ్లం. చూసేవాళ్లకి సుకంగా, ఇనోదంగా ఉండేది. నిజం సెబుతున్నా- ఓపాలి ఇది చూసి ముచ్చటపడి, ఓ పెద్దరైతు జనంలోంచొచ్చి వేలిఉంగరం తీసి నాకు తొడిగాడు,” అంటుంటే పెదకాపు ఓ కన్ను నవ్వింది... ఓ కన్ను చెమ్మగిల్లింది.

“ఇదిగో అరుగు పక్కన బిగించిందే మహానంది బండ. దీన్ని నేలమీద లాగాల... బండి మీద బరువేసుకుని ఇసికకావులో లాగాలి. అన్నిట్లో మనవి గైరే!”

“గొడ్డుచాకిరీ వేరు, యిది వేరు. మూగజీవాలకు మాటమర్మం నేర్పాలి... కదండీ,” అన్నాను.

“అఁ, కదు మరీ... ఆటి దాణాలు వేరు, ఆరోగ్యం చూడాల. ఏం పెట్టేవాళ్లమో, ఏం మేపేవాళ్లమో నాకు, మా ఆడాళ్లకి తప్ప మా పాలేర్లక్కూడా తెలిసేది కాదు. మనం ఉలవలు ముట్టంగందా, అందుకని యేరే గుగ్గిళ్లు జొన్నకూడు ఏవేళకావేళ అందించేవాళ్లం. పత్తిత్తులు, పాలకండెలు తినిపించాల... లేతతమలపాకులు తేనెలో ముంచి అందిస్తే తినేవి. పందాలప్పుడు యాప్లీస్ కాయలు తినిపించేవాళ్లం... ఆ ఓపికలు వేరు... అర్థబలం... అంగబలం...” అంటూ నిట్టూర్చాడు రాఘవయ్య.

“ఈసారి నే వచ్చినప్పుడు మీ ఎడ్ల నగలు చూపించాలి,” అంటూ లేచాను.

పెదకాపు ఉత్సాహంగా తల వూపాడు. ఆయన బుర్రమీసాలు నవ్వాయ్.

* * *

కాలేజీ పడేసరికి డొంకరోడ్లు విశాలమైన తార్రోడ్లయినై. మధ్య కాలవల మీద వంతెనలు పడ్డాయ్. మెయిన్‌రోడ్డు దగ్గరకు జరిగింది. రూట్‌బస్‌లు తిరగడం మొదలై

రెండు మూడు బస్తీలు అందిపుచ్చుకున్నట్టయినాయ్. జనసంచారం ఎక్కువైంది. కాలేజి రావంధాళీ మొదలైంది.

ఆ వరసలోనే కొంచెం ముందు ఓ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి పునాదులు తీస్తున్నారు. రోజూ కొత్త సిమెంటు స్తంభాలు మొలుస్తున్నాయ్. మాగాణి రూపురేఖలు మారాయ్.

ఇంకో పక్కన పాతిక ఎకరాల్లో ఫుడ్ కార్పోరేషన్ గోడౌన్లు లేస్తున్నాయ్.

ఆ డొంకదరిని ఎంటర్‌టైన్‌మెంట్ పార్క్ అన్నారు.

ఈ సందడి చూసి డబ్బున్నవాళ్లు ఎక్కడెక్కడ్నించో వచ్చి ఇక్కడ భూమ్మీద పెట్టుబడి పెట్టడం మొదలుపెట్టారు. నిజాలకు మించిన వదంతులు రోజుకొకటి వినిపిస్తున్నాయ్. రిలయన్స్ వాళ్ల చూపు పడిందన్నారు. త్రీస్టార్ హోటల్ వచ్చేమాట నిజమే! ఇక చిలవలు పలవలుగా మాటలు అల్లుకుపోతున్నాయ్. నేతల కార్లు తరచు అక్కడ పచార్లు చేస్తున్నాయ్.

మంచిరూపం, పుష్కలంగా శిష్యగణం వున్న స్వామీజీ ఆశ్రమం మూడో బ్రాంచి కోసం యిక్కడ పెద్దముక్క తీశారట! అమ్మవారి ఆలయం, వేదం నించి పి.జి.దాకా చదువులు, ఫ్రీ హాస్పిటలూ, యింకా సర్వహంగులూ వస్తున్నాయని వదంతి కాదు... రూఢివార్తే అచ్చేసుకు వచ్చేసింది. మానుకట్టిన చెట్లని రాత్రికి రాత్రి క్రేన్లతో ఎత్తుకొచ్చి అక్కడక్కడ నిలిపి ఆశ్రమానికి పచ్చశోభని, పాతకళని తెల్లారేసరికి తెప్పించారు.

'స్వామివారి దివ్య ఆశీస్సులతో ధరలకి రెక్కలు,' అంటూ డైలీ టాబ్లాయిడ్స్ కోళ్లై కూస్తున్నాయ్.

నేను హాయిగా దద్దోజనం, చక్రపొంగలి మెక్కుతూ, పాత పాఠాలు కొత్తగా చదువుకుంటున్నా. వల్లీని కూర్చోబెట్టి క్లాసులు ప్రదర్శించి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నా. వాళ్లిచ్చిన ఆడియో సిడిలు, వీడియో పాఠాలు శ్రద్ధగా చూసి నోట్సులు రాసుకుంటున్నా. జీతం ఒకటో తారీకున టంచన్‌గా కవర్లో పెట్టి పంపిస్తున్నారు.

"మొదటి మూణ్ణెళ్ల జీతం స్వామికి..." అనగానే నాన్న ఏదో అనబోయారు.

"అది మా మొక్కు... కావాలంటే వల్లిని అడగం,"డన్నాను.

నాన్న ఏదో గుర్తొచ్చినవాడిలా చూసి నవ్వుకుంటూ, "నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష," అనుకుంటూ గుడివైపు వెళ్లారు.

ఆ నవ్వులో మొక్కు చెల్లింపుకు ఆమోదమూ వుంది. ఆనందపుఛాయా వుంది.

నా మనసు కుదుటపడింది.

కోవెలకొలను అద్దంలా ఉంది. అడుగున గుంపులు గుంపులుగా తిరుగాడుతున్న చేపపిల్లలు కనిపిస్తున్నాయ్. తామరతూళ్లు నిలువెల్లా వూగుతూ కొలనులో

కదుల్తూ మునుపటి కళ తెచ్చాయి. కదిలే కలువమొగ్గల మీద ఎక్కడ నిలవాలో తెలియక సీతాకోకచిలుకలు రెక్కలు కొట్టుకుంటూ తిరుగాడుతున్నాయ్.

కృష్ణస్వామి వదిలేసిన గుడి మీద తిరిగి శ్రద్ధ పెట్టడం మాకెంతో బాగుంది.

కొలను మెట్లమీద కూచుని పుస్తకాలేవో తిరగేస్తున్నాను.

శివ అంత దూరం నించే, "నవ్విన నాపచేను పండింది స్వామీ, బెమ్మాండంగా," అంటూ వచ్చాడు.

"మన చేను బేరానికొచ్చింది... వెంచర్లోళ్లడిగారు," అన్నాడు పక్కన కూచుంటూ.

నేను క్లుప్తసరిగా, "అహా!" అనేసరికి నాకేమి అర్థం కాలేదని శివ గ్రహించాడు.

"ఇప్పుడు మన చేను టౌన్‌లో కలిసిపోయేట్టుంది సామీ! రేటు ఎంత చెప్పాలో, ఆ యవ్వారమేందో అయోమయంగా వుంది."

నాకప్పుడర్థమైంది. నవ్వుతూ శివ రెండు చేతులూ ఆనందంగా పట్టుకుని ఊపేశాను.

"మరే, చెబుతా యినండి. మీ కాలేజి వచ్చినప్పటాల్నించి రియలెస్టేటోళ్లు అక్కడి నేలని చుట్టుకుంటా వస్తున్నారు. మనం తగిలాం. రేటు చెప్పండంటే... ఏం చెబుతాం? ఎక్కువ చెబితే ఏమో, తక్కువ చెబితే ఏమో... అంతా గందరగోళంగా ఉంది సామీ."

"ఇరుగుపొరుగు వాళ్లని అడక్కపోయావా?"

"దీని లెక్కలు వేరు సామీ. దేనికి దానికే, ఎక్కడికక్కడే రేట్లు. మొన్న నాకు చిట్టిబాబు తగిలాడు. చిట్టిబాబెవరో నాకే తెలియదు... పాపం, యింకా నీకెట్టా తెలుసుద్ది. నన్ను గుర్తుపట్టి పలకరించాడు. నాతోపాటు అప్పట్లో ఆ కాలేజిలో చదివాడంట. అసలు పేరు దురగారావంట. అయితే, చిట్టిబాబు ఈ ఫీల్డులో పండిపోయాడు. అప్పటికప్పుడు సెల్‌ఫోన్ తీసి లెక్కలు కట్టాడు. మనది పన్నెండెకరాలు ఏకాండి గదా. ఓవైపు పెద్దడొంక హద్దు. ఇంకోవైపు పిల్లడొంక. రేపు వాళ్లు వెంచరేసి ప్లాటింగ్ చేసినపుడు డొంకలు కలిసొస్తాయంట. మన పొలంలో అడ్డరోడ్లు, అమాంబాపతులు పోయినా రెండొందల గజాల ముక్కలు రెండు వేలు తెగుతాయన్నాడు. కమ్ సే కమ్ ఏడాదిలో పదికోట్ల బిజినెస్ అవిద్దన్నాడు.

"నాకు కళ్లు తిరిగాయ్. లక్షకి ఎన్ని సున్నాలుంటాయో మర్చిపోయాం గందా... అసలు మీరేమంటున్నారని దురగారావుగారిని సందేహంగా అడిగా.

"'వాళ్లు తెలివైనవాళ్లు...అందుకే మిమ్మల్ని రేటు చెప్పమన్నారు. పాతకాలం వాళ్లు కదా, మీరెక్కడో నాలుగు లక్షల దగ్గిరో, అయిదు కాడో ఉంటారు. అన్యాయమైపోతారని చెబుతున్నా. వాళ్లకి లెవలింగ్‌కి, యాడ్స్‌కి, ఏజెంట్లకి రెండుదాకా అవుతుంది. ఇదొక చిత్రమైన యవ్వారం, యాపారం. ఉన్నట్టుండి ఒకసారి ఎక్కడో కొత్త తలుపు

తెరుచుకుంటది. ఇహ వేలంవెర్రిగా అంతా అటు పడతారు. ఇక్కడ బూములకి టపీమని రెక్కలు తెగుతాయ్. రేటు పాలపొంగులా దిగిపోయిద్ది. అందుకని మీరు ఉడుములా పట్టుక్కూర్చోనూవద్దు, జలగలా జారిపోనూవద్దు,' అంటా మూడు ముక్కల్లో కిటుకులన్నీ వూదాడు.

"చిట్టిబాబుకి నేనేం చెప్పగలను? యుద్ధంలో కిష్టుడి కాళ్లకాడ బాణాకర్రలు పడేసి కూకున్న అర్జునుడిమల్లే అయిపోయినా. ఆయన బెమ్మాండమైన చురుకు!

"'శివగారూ, మీరు అయిదు మీద ఉండండి... పైన రాదుగాని పాతిక పరక తక్కువకి ఖాయమవుతుంది. బోకరేజీలు యివ్వం... డైరెక్ట్ డీలే,' అని చెప్పండనేతలికి నా మతిపోయింది.

"కలా... నిజమా అనుకున్నా. దురగారావుగారి కాళ్లకి దణ్ణం పెట్టాలనిపించింది. మనకి కాలేజీలో చదువబ్బకపోయినా, ఓ లాభసాటి పరిచయం అంటింది మాదవ సామీ," ముగించి శివ గుక్కతిప్పుకున్నాడు.

ఏళ్ల తర్వాత శివ ముఖంలో జంకు, సందేహం లేని నవ్వు చూశా.

ఇంకా మా ఇంటి అరుగుమీదికి ఈ సంగతులెక్కలేదు.

ఇంకో అడుగుపడ్డాక, పెద్దస్వామికి పెదకాపుకి చెప్పాలని ఆగానంటూ కదిలాడు శివ.

ఉన్నట్టుండి యీ సందర్భానికి ఎలా అభినందించాలో నాకు తోచలేదు. కొంచెం జాగు చేసినా, దేవుడు మన విన్నపాలు ఆలకిస్తాడనిపించింది.

దేవళంవైపు తిరిగి, "కోటి దణ్ణాలు ప్రభూ!" అంటూ శిరసు వంచాను.

రెండు పున్నాగపూలు నిశ్శబ్దంగా కొలనులోకి రాలాయి.

* * *

ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు శివ నాకు ఫోన్ చేసి చెబుతూనే ఉన్నాడు. ఇదివరకటిలాగా గంటల తరబడి వచ్చి కూచోడానికి మొహమాటపడుతున్నాడు.

"ఎప్పుడు చూసినా పుస్తకంలోనే కనిపిస్తుంటే నిన్నెట్టా కదిలిచ్చేది గురువా," అనేవాడు.

"కడుపులో మాట ఇంకెవరికి చెప్పుకోవాల? నువ్వు దేవుడిలాంటోడివి... అందుకే నీకు చెప్పుకోడం మాధవయ్యా."

శివ మాటల్ని ఇబ్బందిపడుతూ అడ్డుకోబోయాను. శివ చేతివేళ్లతో జుట్టుని పైకి అనుకొని-

"మన మద్దెన ఇంత చనువుందే... మరి ఎప్పుడన్నా కొట్టావా తిట్టావా...? పోనీ మందలించావా? నా మానాన నన్నొదిలేశావ్. పడ్డా లేచినా నీ బతుకు... నీ ఇష్టం అని వదిలేశావ్... అచ్చం దేవుడికి మల్లే..."

శివ మాటలకి ఖంగుతిన్నాను.

ఏమనాలో అర్థంకాక ఒక వెర్రినవ్వు నవ్వి ఊరుకున్నాను.

ఔను, శివకి చాటుమాట లేదు.

బేరగాళ్లతో అంచెలంచెలుగా మాటలు నడుస్తున్నాయ్. ధర విషయంలో శివ విన్న మాటలు గాలికబుర్లు కావు.

గట్టి నిజాలే!

* * *

సందర్భానికి తగినట్లు శివ ఎదుగుతున్నాడు. ప్రస్తుతం చక్కర్లు కొడుతున్న కొత్త మాటల ప్రయోగ ఉపసంహారాల మీద పట్టు సాధించాడు.

బేరం తాలూకు మొదటి పంచాయితీని పొల్లుపోకుండా నా ముందుంచాడు శివ.

"వాళ్లు నలుగురొచ్చారు. మా అరుగుకాడే కూకోబెట్టా. అసలు నులక పేన్తా తలెత్తి చూస్తేనా... మా శివుడు!? పాపం, వాళ్లే పలకరించారు. 'ఏంటి మీరు కర్పూరం పట్టించి పేనుతున్నా,'రని ఒకాయన ఆశ్చర్యంగా అడిగాడు.

"'గుమగుమలాడతా ఉంటదని...' పెదకాపు తలెత్తలేదు. పని ఆపలేదు.

"ఇంకొకాయన చొరవచేసి, 'మీ అబ్బాయ్‌గారు చెప్పే ఉంటారు ... పొలం బేరం సంగతి,' అన్నాడు తడబడుతూ.

"'ఆఁ చెప్పాడు,' అంటూ పని పక్కన పెట్టాడు, నెమ్మళంగా.

"'మనం అన్ని విషయాలు ఒకసారి అనుకుంటే... బావుంటుందని వచ్చాం.'

"'బానే ఉంటది. మావాడు చెప్పే ఉంటాడు. అందుట్లో మూడెకరాలు నా కూతురికి కట్నం కింద ఇచ్చా. రాతకోతలు లేవు, నోటిమాట మీద ఉంది. వాళ్లిక్కడ ఉండరు... బాగా దూరం... వాళ్ల మాట తీసుకోవాల మీకు మాటిచ్చే ముందు...' పెదకాపు అనగానే, 'తెలుసండీ... శివరావుగారు చెప్పారండీ,' అన్నారు వాళ్లు గొంతులు కలిపి.

"'ఇంకోమాట... అబ్బాయి అత్తారికి చెప్పాలి... అది వైనం. ఎందుకంటే ఆళ్లు పిల్లనిస్తామని సమ్మందానికొచ్చినపుడు ఇంత బూవసతి ఉందని సెప్పాం. అది చూసే లక్షణమైన పిల్లనిచ్చారు మావాడికి. మా వనమ్మ వస్తా ఎకరం మాగాణి కట్టు కొచ్చింది. అందుకని వాళ్లకోమాట సెప్పడం పద్ధతి...'

"వాళ్లొకసారి ఊపిరి తీసుకుని, నా వంకచూసి, 'అయ్యో తప్పకుండా... మీరెట్లాంటే అట్టాగే...' అన్నారు.

"'మిగతా విషయాలు మా సాంబయ్యతో తేల్చుకోండి. ఆడి మాటే నా మాట... తేడా రాదు,' అంటూ, తిరిగి కర్పూరం చేతులకు పులుముకుని పనిలో పడ్డాడు.

“ఆయనవైపునించి పంచాయతీ కట్టిపెట్టాడని అందరికీ అర్థమైంది.

“అంతటితో లెగిశాం.

“చివరికి మొత్తం నామీద పెట్టినందుకు, ‘హమ్మయ్య!’ అనుకున్నారు- వెంచర్లోళ్లు.

“ఇది సామీ! మొదటి పంచాయతీస్టోరీ,” అని ముగించాడు శివ.

* * *

“అట్లాంటా నించి అక్కాయ్ ఫోన్ చేసింది. నేను బేరం సంగతి చెప్పబోతే అక్కాయే ఎదురొచ్చింది.

“‘ఆ రియల్ ఎస్టేటోళ్లు శానా మంచోళ్లంట... మీ బావయ్యకి తెలుసంట,’ అనేసరికి నాకు మాటపడిపోయింది.

“మీకు తర్వాతి కథ ఇనిపిస్తా,”నంటూ శివ మొదలుపెట్టాడు.

“అంటే వాళ్లు మొదటి పంచాయతీ అవీ కాకుండానే ఆ దేశానికి లైనేశారు. రోజూ ముప్పూట్లా మాట్టాడుతున్నారని అర్థమైంది. ఇప్పుడు మాకంటే వాళ్లు దగ్గిరై పోయారు. డబ్బు ముదనష్టపుది స్వామీ...! నేనూ తెలివిమీరిపోయి, అట్లాంటాతో ఆడుకుంటున్నా- అప్పుడప్పుడు.

“‘చూద్దాంలే... తొందరేవుంది. వచ్చే రేటేగాని పోయే రేటు కాదు.’ నే నిమ్మకి నీరెత్తినట్టు మాట్లాడుతుంటే అక్కాయ్‌కి గుండెల్లో రైళ్లు లగెత్తుతున్నాయ్.”

శివ ప్రత్యక్షవ్యాఖ్యానంలా చెబుతుంటే, నేను మౌనంగా ఆలకిస్తున్నా. పైగా ఇది వాళ్ల కుటుంబ విషయం.

“పదివేలు అటో ఇటో వదిలెయ్. అయినా ఆ పొలం నమ్ముకుని నువ్వేం సుకపడ్డావురా. డబ్బులు పొయ్యడం, చాకిరీచెయ్యడం... వచ్చిందేవుంది? చచ్చిందే వుంది? పైగా అప్పులు...”

“... ... ...”

“సాంబయ్యా నా మాటినయ్యా. ఏదైనా మంచి షోరూం పెట్టుకుంటే బాగుం టదని బావయ్యకుంది. పెట్రోలు బంకైనా కడుపులో చల్ల కదలదంటున్నాడు. ఇది పూర్తయితే ఆలోచిద్దామంటున్నాడు. కావాలంటే పొలం కొన్నోళ్లే అంతా చేసిపెడతా రంట...”

“మా కోసం తక్కువకి అమ్ముకోవద్దు. రేప్పొద్దున ఎకరాకి ఇంకో పది పెరిగిం దనుకో...”

“అన్నిటికీ అట్లా అంటావేందిరా...”

ఈరకంగా అక్కాయ్ ఎంత బతిమాలిందీ ఆ గొంతులోనే వినిపించాడు.

దానికి తగ్గట్టు తనెంత వేధిస్తోందీ సర్దాగా చెప్పుకొచ్చాడు శివ.

* * *

ఉన్నట్టుండి మధ్యస్తంగా సంగతెత్తుకొని శివ-

“శికిష్ణులవారి ముంగల కోలాటం ఏసినట్టుంటదిగాని, మీకో సంగజ్జెప్పాల. ఈ రియల్ ఎస్టేటోళ్ల లెక్కలు వేరు, వాళ్ల ఫిజిక్స్ అలాయిదా, కెమిస్ట్రీ సపరేటు.

“వాళ్ల ఎకరాకి మూడువేల గజాలే! లే అవుటేసినపుడు రోడ్లనీ, పార్కనీ, గుడనీ, గోపురమనీ వుంటాయ్. అందుకని ఆమాత్రం తరుగు తప్పదు.”

శివ మాటల్ని ‘వూఁ’ కొడుతూ వింటున్నా, ఎటు తీసికెళ్తున్నాడో తెలియడంలేదు.

“ఇంటన్నావా... వాళ్ల ఫిజిక్స్ పెకారం నేలకి కావల్సినన్ని పొరలుంటాయ్. ఈ కొత్త బూసాములు డిమాండ్‌నిబట్టి పైకి ఎదుగుతారు. మాయమ్మ అనుకోకుండా సుట్టాలొస్తే ఇడ్డెన్ల దబరాలో రెండు రేకులు ఎగస్రా తగిలిస్తది. ఇంకెవరన్నా ఆ టయానికి ఇంటికొస్తే ఇంకో రేకు ఎక్కిస్తది. ఈ వెంచర్ బాబులూ అంతే! రూపులు పోసుకుంటా కిందికీ పోతారు, పైకీ ఎళ్తారు. అయిదుకి లాబాలు చాలకపోతే ఏడు. అప్పటికీ ఆశ తీరకపోతే తొమ్మిది... ఆపైన పెళ్లిమండపం...” అంటూ లెక్చరిచ్చాడు.

“నీ పొరల సిద్ధాంతం బావుంది. శివా... దీన్ని పాఠంగా పెట్టాల్సిందే,” అన్నాను.

“ముక్కూ మొహం తెలవదు. రంగూ రుచీ వాసనా ఎరగరు. మొదటి సిటింగ్ అవిందో లేదో అట్లాంటాకి లైనేసి- అట్నుంచి కొట్టుకొచ్చారు చూడు సామీ... అదీ వాళ్ల కెమిస్ట్రీ!”

శివ ఎమ్.పి.సి. థీరం తర్కానికి నిలబడుతుంది.

ఈమధ్య శివరావుగారు తెలివి మీరారు.

దుబ్బు చేశారు.

గడుసు తేలారు.

బూడిద పట్టారు.

‘శివా! వర్ధిల్లు!’ మనసారా దీవించాను.

* * *

రెండు సిటింగ్‌ల తర్వాత బేరం ఖరారైంది. కొంచెం కుడిఎడంగా, పన్నెండెకరాల సింగిల్ బిట్- అయిదు కోట్లు! వూరూ వాడా ఘనంగా చెప్పుకున్నారు. ఇక మన వంతు వస్తుందని కాడిగట్టు చేలవాళ్లు కలలు కంటున్నారు. కొందరు ముందే చెట్లెక్కి కూర్చున్నారు. ‘సమయం వచ్చినపుడు వీళ్లని ఎట్లా చెట్లు దింపాలో వాళ్ల కెరుకే!’ అని కొందరనుకుంటున్నారు. ఏమో చూడాలి!

ఏది ఏమైనా ఊళ్లో ఒక మంచి వాతావరణం అలుముకుంది. బాగా డబ్బు లాడుతున్నాయ్.

రైతులకి ఉదారంగా అప్పులు పుడుతున్నాయ్.

వేణుగోపాలస్వామి ఆలయ ఉద్ధరణ పనులు సాగుతున్నాయ్.

భక్తి నెర్రెబారిన చోట తిరిగి వసంతం తొంగిచూసింది.

మంకెనలు, మునిగోరింటలు కిలకిల్లాడుతున్నాయ్.

తులసివనం విస్తరించింది.

కలశాల కిలుం వదులుతోంది.

గుడిగంటకి గొంతు లేస్తోంది.

ఊరిజనంలో దైవభక్తి తదియనాటి వెన్నెల్లా తారాడుతోంది.

* * *

అంత దూరం నించే, "మాదవసామీ, రెండే రెండు నిమిషాలు... యిప్పటిదాకా జరిగిందేదో నీ చెవిలో వేసెల్తా... లేపోతే బరువు మొయ్యలేను," అంటూ శివ దగ్గర కొచ్చాడు. మొదలుపెట్టాడు.

"పొలం కొలతలు పూర్తయినాయి. కొత్తగా హద్దురాళ్లు పాతారు. బరువైన పెద్దనోట్ల సంచీ పెదకాపు చేతిలో పెట్టి, 'ఎంత కావాలన్నా అడిగి తీసుకోండి. రిజిస్ట్రేషన్‌లో చుప్తాగా సెటిల్ చేస్తా,'మన్నారు.

"వాళ్లటెల్లగానే, ఆ సంచీ నా చేతిలో పెట్టి, 'సాంబయ్యా సేను యిప్పుడే అప్పగించాలా... పై పంటదాకా గడువుందా?' అంటే, తలొంచుకుని లేదన్నాను.

"'మరి కొంద్ర లేపోతే ఏం దున్నుకు బతుకుతాంరా,' అంటా వులిక్కిపడి నాన్న కళ్లొత్తుకుంటే నా గుండె చెరువైపోయింది. నీరు కారిపోయా. మొహం చాటేశా. ఆ సంచీ అమ్మ చేతికిచ్చా. అమ్మ కొంగుతో కళ్లు తుడుచుకున్నా.

"చేతివేళ్లు ముడిచి, విప్పి, 'అయిదు కోట్లా...! అంత డబ్బు ఏం చేసుకుంటాంరా చిన్నాడా?' అని బయం బయంగా అడిగింది అమ్మ.

"మాదవయ్యా, జరిగింది జరిగినట్టు చెప్పా. ఇప్పుడు నన్నేం చావమంటారో చెప్పండి," దీనస్వరంతో నన్ను నిగ్గదీశాడు శివ.

నాకు జాలేసింది. శివ నలిగిపోతున్నాడు. వెన్ను నిమిరి ధైర్యం చెప్పా. కొంచెం వేడి తగ్గితే, రోజులు గడిస్తే అన్నీ సద్దుకుంటాయన్నాను.

"ఏందో... ఈ ఏడుపులేందో... లవంగాల ఓడ మునిగినట్టు," అనుకుంటూ కదిలి వెళ్లాడు శివ.

అది మూడు సంధ్యలు ముడిపడే వేళ.

చీకటి కాదు, వెలుతురు లేదు. నారసింహ పొద్దు.

కొంచెం ఆగితే వెన్నెలొస్తుంది!

* * *

నాకు ఫోన్ చేసి, నేను ఖాళీగా వుండే టైం తెలుసుకుని కాలేజికి వచ్చాడు శివ.

"అదృష్టమంటే యిట్టా ఉండాలి. మనం కాలేజి వూరెళ్లడం కాదు... కాలేజే మనూరు నడుచుకుంటూ రావడం..."

శివ మాటలకి నవ్వాను. నా గదికి తీసికెళ్లాను.

"వచ్చేనెలాకరులో రిజిస్ట్రేషన్ ఖరారు చేశారు... అసలు మన ప్రమేయం ఏమీలేదు. అమెరికా వాళ్లు ఎప్పుడు దిగుతున్నారో, మళ్లీ ఎప్పుడు వెళ్తున్నారో అంతా రియల్ ఎస్టేటోళ్లే చూసుకుంటున్నారు. అన్నట్టు మీకు చెప్పాల... చుట్టం పేరంటం కలిపేశారు. అక్కాయ్ కూతురికి ఓణీల ఫంక్షన్ కూడా కాయమైంది."

"ఆహాఁ... చాలా బావుందే."

"మా యమ్మకి సగం యినపడదు, సగం యినిపించుకోదు. ఈ ముక్క యిన్నప్పటాల్నించి ఉక్కిరిబిక్కిరై చస్తాంది.

"మా వనమ్మకి తెంపులేకండా సంతోసపు తేపులొస్తున్నాయ్. ఈ కబుర్లిట్టా ఉంటే, నిన్న మా నాయన పిలిచి- 'సాంబా... నేను పోగొట్టింది తప్ప సంపాయించింది లేదు. పెద్దలిచ్చిన బూమిని సెంటు లేకుండా తెగనమ్మితే ఎట్రా...' అన్నాడు దిగాలుగా. ఏమనాలి చెప్పండి స్వామీ," అన్నాడు.

"పెద్దవాళ్లలాగే ఉంటారు శివా..."

"ఇదే పెద్దోళ్లు మా నాయనమ్మ పోగానే, ఆవిడ పాత నగలన్నీ చెరిపిచ్చి బెమ్మాండంగా కావల్సిన నగలు చేయించుకున్నారు... పెద్దదినం కాకుండానే. అది బావుందా... మరి బూమీ బంగారం లాంటిదేగా," అంటూ చాలాసేపు వేష్టపడ్డాడు - "అంతా కలిసి నన్ను తప్పుచేసినోడికింద జమ కడుతున్నారు."

ఒక్క క్షణంలో తిప్పుకుని, జేబులోంచి ఫోన్ తీసి, "నాలుగు మాటలు పలికిస్తా ఇనుకోండి," అన్నాడు.

శివ చిరునవ్వులోంచి ఫోన్ నోరు విప్పింది- అట్లాంటా అక్కాయ్ గొంతుకతో-

"సాంబా, అయితే పెద్దడొంకలో పనసచెట్టు కూడా పోయిద్దంట్రా...?"

"ఆఁ... అడుగంటా నరుకుతారు. మన చేనుగట్టు చింత, వేప కూడా ఖాళీ..."

"అదేంట్ర సాంబయా..."

"వాళ్లు కోట్లు పోసి కొన్నది చెట్లు పెంచడానికి కాదే చిట్టెక్కాయ్, గోడలు మేడలు పెంచడానికి..."

"నీకు తెలవదురా సాంబా, పనసకొయ్యతో వీణలు చేస్తారంట్రా..."

"నరికి పోగులు పెట్టాక వీణలు చేసినా, పొయిలో పెట్టినా దానికేం తేడా పడదు... మనకీ పడదు."

"ఎందుకురా సాంబయ్యా అట్టా మాటాడతావ్?"

శివ ఫోన్ కట్ చేసి, "ఇన్నారుగా ముప్పొద్దులా ఇవే ఆరిందా మాటలు. అగ్గెత్తు కొస్తాందంటే నమ్మండి," అంటూ లేచాడు.

"కొంచెం ఓపిక పట్టు శివా, అన్నీ అవే సద్దుకుంటాయ్," అని చెప్పి పంపాను.

* * *

"అక్కాయి బావోళ్లొస్తున్నారు కామట్టి, మనం కూడా ఆ వచ్చేది యాడపెట్టాలో, ఏం చెయ్యాలో ఆలోచించి ఓమాట అనుకుంటే మంచిది," అన్నాడు సాంబయ్య ఇంట్లోకి వస్తూనే.

తండ్రి తలెత్తకుండానే కళ్లెత్తి కొడుకు వంక చూశాడు. చాలా శ్రద్ధగా వుండ చుడుతున్న నులక విచ్చేని పక్కనపెట్టి, గట్టిగా శ్వాస వదిలి, "ముందు మొక్కులు చెల్లించాల," అన్నాడు సూటిగా సాంబయ్యకి వినబడేలా.

ఆగి, ఏవిటన్నట్టు చూశాడు శివ.

తండ్రి నిలబడి, కొడుకు కళ్లలోకి చూస్తూ, "మన ఊరి చెర్లో నందిస్తంభం ఏయించాలి. పూర్వం వుండేదే... పోయింది," అన్నాడు.

ఒకడుగు సాంబయ్య వైపు వేశాడు.

అట్నించీ ఓ అడుగు పడింది.

"చెరువు మద్దెన నందిగ్రహం తీరుగా మడకాళ్ల మీద కూకుని ఉంటే- నీళ్లు తాగొచ్చే లేచూడి ఆవులు మోరలెత్తి సూత్తాయ్. ఇహ వాటి కడుపుల్లో ముద్దరేసినట్టు నందులే పెరుగుతాయ్. వుప్పుడు నందిస్తంభం మల్లా మనం నిలబెట్టాలి... సాంబా! ఇది మొక్కనుకో," తండ్రి పలుకు సౌమ్యంగా వున్నా, అది ఆజ్ఞలా జారీ అయింది.

మొక్కు ఏవిటో తెలిశాక సాంబయ్య మొహం కొంచెం తేలికపడింది. "ఔను, కాని... మనూళ్లో ఇప్పుడు మూడే ఆవులున్నాయ్. అందుట్లో రెండు వొట్టిపోయినయి. మూడోది పొద్దుగూకులూ నాంచారయ్య నూనెగానుగ తిప్పుతోంది," అనేసి, సాంబయ్య అవతలకి కదిలేంతలో-

"దాందేవుందిలే... సుళ్లు సూత్రాలు చూస్కోని, నాలుగు పాలొదిలిన పెయి దూడల్ని మనమే దొడ్లో కట్టేసుకుంటే సరి... నందిస్తంభానికి పరువు, గావాఁనికి మరియాద..."

తండ్రి మాటలకి నివ్వెరపోయాడు. ఏమనాలో తోచలేదు.

"ఏవుందిరా... నాలుగేళ్లలో దొడ్డిచేస్తది... మంద కడతంది," అనేటప్పుడు బాధ్యత, ఆశ, ఆనందం ఆయన కళ్లలో మెరిశాయి.

సాంబయ్య తండ్రిని రెప్పవేయకుండా చూస్తూ నిలబడ్డాడు.

రాఘవయ్య దగ్గరగా... చెయ్యేస్తే కొడుకు బుజం మీద పడేంత దగ్గరగా వచ్చాడు.

"సాంబా! బూమ్మీదికొచ్చాక కొన్ని బాజ్జతలుంటాయ్... పతోడికీ కొన్ని బాకీలుంటాయ్... ఆట్ని తీర్చాల... ఎగెయ్‌కూడదయ్యా... ఎంత సెడ్డా మనం మడుసులం

గందా,'' తండ్రి మాటలు విడివిడిగా, చల్లగా తొలకరి చినుకుల్లా అతని గుండెలమీద రాలాయి.

కొడుకు నిలువెల్లా మెత్తబడ్డాడు.

నేలగంధం గుప్పుమంది... పండునిప్పులమీద గుగ్గిలం పడ్డట్టు.

సాంబయ్య అప్రయత్నంగా శిరసు వంచాడు.

రెండు చేతులూ తండ్రి పాదాల వైపు సాచాడు.

గిరుక్కున తిరిగి బయటకు నడిచాడు.

తండ్రి పెద్దరికం బిడ్డ తల నిమిరింది.

'సంకల్పసిద్ధిరస్తు'- గుడిగంట కంచుకంఠంతో దీవించింది- ఊరూవాడా వినిపించేలా.

ఆ మాట సాంబయ్య నోట వినగానే కృష్ణస్వామి, ''చెవిలో అమృతం పోశా వయ్యా... అమోహం పెదకాపూ! సెంటు భూమి లేకపోయినా నువ్ జన్మజన్మలకూ పెదకాపు!''

ముగ్ధుడై, ''ఆ నోభద్రాః క్రతవో యన్తు విశ్వతః'' అంటూ చేతులు జోడించాడు కృష్ణస్వామి.

నందిస్తంభ సంకల్పం గుడిని ఆవహించి, మూలమంత్రమై, జీవనసారమై, వేణునాదమై, అంబారవమై, గొబ్బిపాటై పల్లవించింది.

పారిజాతమై పరిమళించింది. పాలపొదుగై చేపింది!

* * *

శివ ఫోను-

''అలో... సామీ! మీ రాగవయ్యగారింటికి విమానంలో పెళ్లిసందడి వచ్చింది. అమెరికా సుట్టాలు దిగారు. మా అమ్మకి, వనమ్మకి చేతినిండా చాకిరీ.

''ఎయిర్పోర్ట్కి కార్లు వెళ్లడం కాణ్ణించి మొత్తం వెంచర్ల ముఠాయే నెత్తినేసు కుంది.

''ఓణీల ఫంక్షన్కి షామియానా నించి, బల్లలు కుర్చీలు, లైటింగు, వంటలు, వడ్డనలు, వీడియోలదాకా వాళ్లే చూస్తారని అర్థమైంది. రెండు కార్లనీ, డ్రైవర్లనీ వాకిట్లో పెట్టారు. చిల్లరపన్లకీ, పిలిస్తే పలకడానికి చాకుల్లాంటి ఇద్దరు కుర్రాళ్లని గుమ్మంలో నిలబెట్టారు.

''మనకేం పన్లేదండీ... ఊరికే చూస్తా కూకోడమే... మా నెత్తిన దేవుడు పాలు పోశా,''డంటూ ఇంటి సంగతులు ఫోన్ చేసి ఏకరువు పెట్టాడు శివ.

''...అంతా వచ్చారన్నమాట... వెరీగుడ్... వీలుచూసుకు వస్తాలే,'' అన్నాను.

''రండి... రండి... సోజ్యాలు సూద్దురు రండి... పెదకాపు మహాశివుడికిమల్లే చేతుల్తో తాండవం పేస్తన్నాడు. ఇవాళే టౌనెల్లి పార్లల్లో వనమ్మ మొహం తుడిపించు

కొచ్చింది. 'బావుంది నీ దేబెమొహం ఇంకా బాగా కనిపిస్తోం'దన్నా... మెచ్చుకోలు అనుకుంది."

"... ... ..."

"పన్లోపనిగా అంతా కలిసి మాయమ్మ జుట్టుకి రంగేపించుకొచ్చారు. దొంగ మొహం దొరికిపోతా ఉంది..."

అదేంటన్నాను.

"అరవై దాటిన మొహానికి తారునలుపు జుట్టు తగిలిస్తే ఎట్టా వుంటది... సొట్టలుపడ్డ ఇత్తడిబిందకి బూర్లెమూకుడు బోర్లించినట్టుండదూ..."

మౌనంగా వింటున్నా.

నేను ఆనందిస్తున్నట్టు తెలిస్తే శివ మరీ రెచ్చిపోతాడు.

"వింటున్నారా... ఆ చిన్నదానికి వెయ్యి రూపాయలతో ఒళ్లంతా గోరింటాకు ఏపిద్దామనుకుంటే అది 'నో' అనేసిందంట. నాకీ గొట్టంగోరింటాకు వద్దు, నిజందే కావాలని ఇంగ్లీషులో గోల చేసిందంట... ఇదంతా ఓణీల పండక్కి ట్రయల్ పార్టు. వీడియోలో బెమ్మాండంగా పడాలంట."

నేను ముక్తసరిగా విన్నా, ముభావంగా ఉన్నా శివ ధోరణి ఆగడంలేదు.

"ఏదొచ్చినా మాకు చావే సామీ. మొన్నటిదాకా రాబడికీ పోబడికీ పొంతన లేక సచ్చాం. ఇప్పుడు చాలినన్ని అవసరాల్లేక అల్లాడతన్నాం... మునుపెరగం ఇప్పుడు చుట్టాలు... చుట్టాలు తొక్కితే లెగుస్తున్నారు. ఒక్క నిజం చెప్పనా..."

"చెప్పు శివా..."

"చుట్టాలు రెండు రకాలు. కష్టానికి ఆదుకునేటోళ్లు... సుకానికి ఆదుకునే వాళ్లు."

"నిజంగా... నాకేం అర్థం కాలేదు."

"మాదవయ్యా!! మనకి సుకాలొచ్చినపుడు వచ్చి వాలే చుట్టాలూ వుంటారు... తప్పదు. వాళ్లు లేపోతే బతుకు బాజాబజంత్రీల్లేని ఊరేగింపు అవిద్ది..."

చిన్ననవ్వుతో వినేసి, "క్లాసు పిలుస్తోంది శివా," అంటూ ఫోను కట్టేశా.

* * *

పొద్దున్నే వచ్చాడు శివ.

అమ్మ, వల్లి పలకరించి పనులెందాకా వచ్చాయన్నారు.

"ఓ బెమ్మాండంగా అవుతున్నాయ్. షామియానాలు దిగుతున్నాయ్. బల్లలు, కుర్చీలు వస్తున్నాయ్. మన చేలో కొట్టిన చెట్లన్నీ పేళ్లేసి తెచ్చి గుట్టేశారు.

"వంటోళ్లు నీల్లోళ్లు పై ఊళ్లనించి వస్తారంట. వడ్డించేవాళ్లకి పగటివేషాలంట.

"పాప ఓణీల పండక్కి పాతిక రకాలన్నా ఉండాలని వెంచెర్లోళ్లు మారాం చేస్తున్నారంట... అంతా వాళ్లదేనండి... మనదేం లేదండి... ఎంతయినా ఎనకొచ్చిన కొమ్ములు కదండీ..."

శివ ఏకధాటిగా చెప్పేశాడు.

వాళ్లు కదలంగానే శివ నావైపు తిరిగి-

"బయట కట్టెలడితి చూసి, 'సాంబా! దిబ్బమీది కానుగచెట్టు కూడా కొట్టేసి నట్టున్నారుగా... సత్తారు సాయిబు నెలకోపాలి రేవుపెట్టి గొడ్లకి నాడాలేసేవోడు. ఎడ్లకి, దున్నలకి నైసునైసుగా కొమ్ములు చెక్కేవాడు. పాపం! ఆ చెట్టుకిందే బళ్లకి కందెన లేసుకునే వాళ్లం... పందుంపుల్లకి చిన్న రెమ్మిరిచినా సయించేవాళ్లం కాదు,' అని పైకి చూస్తా పెదిమ యిరిచాడు మా నాయన.

"దీనికి మీరే నా పొజీషన్‌లో ఉంటే ఏమనేవారో అనండి స్వామీ... యింటాను," అన్నాడు శివ సూటిగా.

"నీకెన్నోసార్లు చెప్పా... వాళ్ల జ్ఞాపకాలేవో వాళ్లని వేధిస్తాయని..."

"నేనేనండీ ఏ గ్యాపకాలు లేని మొద్దుని. ఇప్పుడు వూళ్లో ఒక్క ఎద్దు లేదు, ఒక్క పోతు లేదు... నాడాలు కొట్టించుకోడానికి. ఒఖ్ఖ బండి లేదు... ఇరుసులకి ఆవదం పెట్టించుకోడానికి. పెదకాపుకి మాత్రం కానుగచెట్టు మీద వల్లమాలిన బెంగ... మద్దెన నా పేనాలు తోడేస్తున్నారు..." తల పట్టుకున్నాడు శివ.

ఇంతలో పాలటుకుల గిన్నెలు మా ఇద్దరికీ వచ్చాయ్.

ఇష్టంగా అందుకున్నాడు శివ. పాపం, అల్పసంతోషి!

"ఈటికోసమే వచ్చా సామి, నిజం... అటుకుల్తో ఎన్ని రకాలు తినిపించారో?! పాలల్లో, పెరుగులో, పానకంలో, పరవాన్నంలో... ఇంకా ఉప్మా, పులిహోర, లడ్లు, ఏపుళ్లు... అటుకుల పలారం పెట్టినపుడల్లా అమ్మగారు ఏదో అంటా పెడ్తారు... మంత్రమా?"

"కాదు... శ్రీకృష్ణభోగం కుచేలభాగ్యం అంటుంది," అన్నాను నవ్వుతూ. "...అంటే అటుకులనిలే."

మాటల్లోనే తినేసి గిన్నె పక్కన పెట్టాడు శివ.

చొక్కాతో మూతి తుడుచుకుంటూ, "తాడిని తన్నేవాడుంటే బెమ్మాండంగా దాని తలదన్నే వాడుంటాడు," అంటూ ప్రారంభించాడు. ఒకసారి వేళ్లతో తల దువ్వాడు.

"...మీకప్పుడు చెప్పాగా చిట్టిబాబు... అదే దురగారావు."

"అదే నీ క్లాస్‌మేట్ అన్నావుగా..." అన్నాను.

"అదేంలేదు, ఓ రాయేశాడు. అది ఈ మట్టిబుర్రకి సూటిగా తగిలింది."

నేను అయోమయంగా చూశా.

"అక్కడ మనది పన్నెండెకరాల ఏకాండి చదరం ఉంది. దాన్ని ఎట్టన్నా ఆళ్లు దక్కించుకోవాల. ఇంకా ఒకళ్లిద్దరు వేటలో ఉన్నారంట. అప్పటికింకా రేట్లు పొక్కలేదు. పైగా అందులో కొంత అమెరికా వాళ్లదని తెలుసుకున్నారు. ఎట్టాగైనా మన్ని ముగ్గులోకి దింపాల. అప్పుడు చిట్టిబాబు నాకు ధర చెప్పి, చెట్టెక్కించాడు. వేరే వాళ్లొచ్చినా నేను దిగను కాబట్టి కొంచెం అటో ఇటో వాళ్లకే దక్కుతుంది."

"దానికి మధ్యవర్తులెందుకు... అసలువాళ్లే అడగచ్చుగా..."

"అక్కడే ఉంది శమత్కారం. ఎవడో మేలుకోరేవాడిలా వచ్చాడు. ముక్కూ మొవం తెలవదు. కాని, మన గురించి అంతా తెలుసుకున్నారు. వీడు ఎఱ్ఱపూల బులుగురంగు ట్రంకు పెట్టి, నాలుగు జతల బట్టలు ఆస్టల్లోనే వదిలేశాడనీ, పాత సర్టిఫికెట్లు ఇంకా కాలేజీలోనే భద్రంగా ఉన్నాయనీ- వాళ్లు కూపీ లాగారు. మన రోల్ నెంబరు మనకి గుర్తులేదుగాని వాళ్లకుంది. ఇహ దురగారావు యేసిన రాయి ఎట్టా గురి తప్పుద్ది? అయిందా... ఆ తర్వాత ఈ చదరం బేరం అయిపోయిందని ప్రచారం చేశారు... ఇంకెవరూ దీని జోలికి రాకుండా కాశారు. ఇహ పోటీలేదు, పై పాటలేదు. ఆళ్లకి టెన్సన్ లేదు... అదీ విషయం..."

"అంటే... ఇంకా ఎక్కువ వచ్చేదా?" అన్నాను అనుమానంగా.

"వస్తే వచ్చేదేమో... మనకి వచ్చిందే శానా ఎక్కువ... పోయింది పాల్లు," అని హాయిగా నవ్వాడు శివ.

"అది వదిలెయ్‌గాని సామీ, మనం దేవుడికి బోలెడు బాకీపడ్డాం, ఇప్పుడు కొంచెవన్నా తీర్చాలి..."

నాకు గుర్తే, పెద్దస్వామి కోరిక.

"గోరింట తిన్నె గుళ్లో వేయిద్దాం... అట్టా ఇట్టా కాదు బెమ్మాండంగా పాలరాయి పరిపిద్దాం... ఎట్టుండాలో సెప్పండి," అన్నాడు శివ ఉత్సాహంగా.

"పెద్దస్వామినే అడగరాదూ..."

"అమ్మో... వద్దులే. మీ దగ్గర వింటే సుకంగా ఎక్కుతుంది."

నేను నవ్వి, "విశాలంగా ఉండాలి... ఎనిమిది పలకలుగా ఉండాలి. చుట్టూ మెట్లుండాలి... ఆ తిన్నె మీద రాధాకృష్ణులు ఒకరికొకరు పారాణి దిద్దుకుంటున్నట్టు పాలరాతి విగ్రహం ఉండాలి," అన్నాను.

"ఇంకా..."

"వారి తలపై ఆచ్ఛాదనగా పొగడకొమ్మ వంగి వాలాలి."

"ఇంకా..."

"మెట్లమీద, తిన్నెపైన అమ్మలక్కలు, ఆడపిల్లలు తినితీరి కూచుని ముచ్చట్లాడుకుంటూ కొసరి కొసరి గోరింటాకు మెత్తుకోవాలి," పక్కనించి కృష్ణస్వామి గొంతులో వినిపించింది.

ఆయన పరిహాస కుశలత, విశాలమైన నవ్వు తిరునామంలో మెరిశాయి.

శివ వులిక్కిపడ్డాడు.

సాక్షాత్తూ పెద్దస్వామే విని, వంత పలికినందుకు శివ ఆనందపడ్డాడు.

పెద్దాయన దూరంగా కదిలి వెళ్లడం గమనించి, నావైపు చూస్తూ, "మరింకా..." అన్నాడు శివ వుల్లాసంగా.

"పుచ్చపువ్వులా వెన్నెలుండాలి," అని ముగించా.

"వెన్నెల సంగతి మీరు, మీ దేవుడు చూసుకోండి. మిగతావన్నీ నా కొదిలే యండి," అన్నాడు శివ విలాసంగా. నా చేతిలో చెయ్యేసి, "దేవుడి సాక్షిగా," అంటూ లేచాడు.

ఆ ధోరణిలో యిచ్చిన మాట నెరవేరుస్తాననే ధీమా పొంగింది.

వెళ్తున్న శివని చూస్తూ వుండిపోయా.

శివ యిప్పుడు అక్షరాలా కోటీశ్వరుడు!

కాని, ఏమాటకామాట చెప్పుకోవాలి... శివ కోట్లింకా ధరించలేదు. కనకే మా మధ్య ఎడం పెరగలేదు. చనువు తరగలేదు.

థాంక్ గాడ్!

* * *

ఇంట్లో పదేపదే అర్చకస్వామికి పంపాల్సిన మోయిన్లపట్టీ వల్లిస్తున్నాడు రాఘవయ్య.

"పెద్దమూట బియ్యం, తగినన్ని సంబారాలు, బెల్లం మాత్రం దండిగా ఉండాలి. దేవుడికి యెన్న ఇష్టం. అన్నీ జాగ్రత్తగా చూసుకోండి. సాంబయ్యా, మంచి అరటిగెల, కొబ్బరికాయలు ముఖ్యం. మంచిగుమ్మడీ... మరి నాలుగు పచ్చికూర్లుం డాలి. అయ్యోరికి, అమ్మగారికి తెచ్చిన పట్టు చదివింపులు మర్చిపోకండమ్మాయ్. ఇస్తరాకుతో మొదలుపెట్టి తమలపాకు దాకా తల్చుకుంటే మధ్యలోవన్నీ గుర్తొస్తాయ్. చిట్టెమ్మా, ఇంకా నలుగుర్ని పిలుచుకో... అన్నీ ఒక్కసారిగా తీసికెళ్లండి. నీ పెళ్లికి మోయిన్లు బండిలో పంపాం. మన ఎడ్లకి నగలన్నీ పెట్టి గులాములు కొట్టాం..." మీసాలు దువ్వుకుంటూ నెమరేసుకున్నాడు పెదకాపు.

"బండెనకమాల పాలుపెరుగుల కావిడి, పళ్లకావిడి నడిచాయ్," తలుచుకు పొంగిపోయింది ఇంటావిడ.

* * *

పెదకాపు వాకిలికి పెళ్లికళ వచ్చేసింది.

ఓపక్క ట్రాక్టర్లు షామియానాల్ని దింపుతున్నాయ్. మరోపక్క అలంకారానికి గెలలతోసహా తెచ్చిన అరటిచెట్లని గాతల్లో నిలబెడుతున్నారు. రంగు కాయితపు తోరణాలు గాలికి పిచ్చిచప్పుడు చేస్తున్నాయ్.

పిల్లలు కొబ్బరాకు బూరాలు వూదుకుంటూ అల్లరిగా ఆడుకుంటున్నారు.

పెదకాపు పట్టుపంచె, పట్టులాల్చీ, నుదుట గీరునామంతో ఆనందతాండవ మాడుతున్నాడు.

వెనక వసారాలో భోషాణంలోంచి రకరకాల వస్తువులు తోడి తీస్తున్నాడు. అవి ఎడ్ల నక్కట్టు, అలంకారాలు!

ఇంటావిడ భద్రంగా అందుకొని, వాటిని రెండు చేతులా తడిమి మహదానంద పడుతోంది.

మధ్యన ఓణీల పెళ్లికూతురు చిలకపచ్చ పట్టుపావడాలో అమ్మమ్మ తాతల మధ్య నగలేసుకున్న చల్లకవ్వంలా ఆడిపోతోంది.

నన్ను చూస్తూనే -

"రా సామీ... రా, నీ కోసమే చూస్తన్నా... నా కబురందిందో లేదోనని. గనుడా బూసురుడేగెనో, నడుమ మార్గశ్శాంతుడై చిక్కెనో... అంటా మా కృష్ణస్వామి ఆలిస్యానికి పాడే పద్యం తలుసుకుంటున్నా..." నవ్వుతూ నన్నందుకున్నాడు రాఘవయ్య.

చుట్టూ కలయచూస్తున్న నన్ను గమనించి, "చివయ్యలేళ్లే... జెర్రిలా నలభై కాళ్లతో తిరుగుతున్నా పన్లవటంలా... కుడితినపడ్డ ఎలకల్లే యీదలేక సతమతమై పోతున్నాడు... యవ్వారాల్తో పుక్కిలింతలవుతున్నాడు," అన్నాడు.

నా చూపులు భోషాణం మీదికి తిప్పాను.

పెదకాపమ్మ మైనపు గోతాల్లో చుట్టిపెట్టిన వాటిని విప్పి, భోషాణం మీద పరుస్తోంది.

ఆ పక్కన మెడలో రెండు కెమేరాలు, బుజానికో ఐ-పాడ్, కాకుండా సెల్‌ఫోన్- ఇన్నింటితో వేగుతోంది అమెరికా పిల్ల.

అలవాటులేని దండె కడియాల్ని సరిచూసుకోవాలి... నడుముకి వడ్డాణం మొయ్యాలి... చేతిగాజుల్ని తట్టుకోవాలి... పాపిడి గొలుసుని కనిపెట్టుకోవాలి... ఈ బాధ్యతలన్నిటి మధ్య మంచి దృశ్యాల్ని చిక్కించుకుని మెడకి వేలాడుతున్న వలల్లో పడెయ్యాలి! పాపం, ఎంత కష్టం!

"ఒక్కొక్కటీ ఇశదంగా చూడు మాధవయ్యా... వాటి పేర్లు, కత అందరికీ తెలిసేలా మూడు ముక్కల్లో రాయాల," అనగానే అందుకు సిద్ధపడ్డాను.

"ఇనుకో సామీ- యివి బొడ్డువార్లు... ఇవి గుమ్మడిపూల నడుం పట్టెళ్లు... అక్కడ... అవి మెడగంటలు... జాగ్రత్తగా రాసుకో సామీ. ఇవి ముట్టెలమీది సూర్య పతకాలు... ఎండివి, తెల్లశంకాల నల్ల దిష్టితాళ్లు, ఇవి మెడల రంగుపూసల దండలు."

ఇంటావిడ అందుకుని, "కొమ్ము కొనలకి రాగిచుట్లు... సామీ ఇవి గిట్టలకి కుంకుడు మువ్వలు," అంటుండగా-

“ఇదిగో, ఇంటిది నా కళ్లు కప్పి దాపెట్టిన ఒకే ఒఖ్ఖ వెండితోడా,” అంటూ నా చేతికి అందించాడు పెదకాపు.

పెద్దపెద్ద పచ్చిపేళ్ల మేదర తడికలు తెల్లగా రంగు పూసుకుని గోడవారగా నిలబడి ఉన్నాయ్.

నాకర్థమైంది, భోషాణమంతా వాటిమీద పొందిగ్గా పరవాలి. పేర్లు, వివరం సక్రమంగా రాసే ప్రయత్నం చేస్తున్నా.

మధ్య మధ్య మనవరాలు మెరిపించే మెరుపులు, కొట్టే కేరింతలు, గ్రానీ గ్రాపాలు, వన్మోర్, స్మైల్ ప్లీజ్‌లు తెరిపిలేకుండా వున్నాయ్.

ఆ పిల్ల గ్రానీ గ్రాపా అన్నపుడల్లా సారీగాపా అన్నంత హాయిగా ఆ జంటకి వినిపిస్తోంది. సెల్ఫీలకి నవ్వులిస్తున్నారు. మాటిమాటికీ బుజ్జమ్మ బుగ్గలు పుణుకుతున్నారు అమ్మమ్మ తాతలు.

“ఇదిగో సామీ చూసుకో... రాసుకో... ఇవి వెన్నులకి గవ్వల పేర్లు, ఇవి ముకం మీది కొండెకుచ్చులు, మూపురాలకి మొగమల్ టోపీలు, శాటిన్ మెరుపుల మీద అద్దాలద్దిన గంతలు... ఇది పెదపాలేరేసుకునే చెమ్కీకోటు.”

ఆయన వుత్సాహంగా చెబుతుంటే వాటన్నింటినీ పేరు పేరునా అందుకుంటుంటే నా మనసుకి మిరియపు జున్నారగిస్తున్నట్టుగా వుంది. ఎక్కడ అయిపోతుందోనని భయమేస్తోంది.

అటకలెక్కిన నాటి మన సేద్యసంస్కృతిని తట్టిలేపి, దోసిటపట్టి నీరాజనాలిస్తున్నట్టనిపిస్తోంది.

నా కళ్లని ఆనందపు పొరలు కమ్మాయి.

“ఇంకా మన జతకి జోగీజోగడాలు శానా వుండేవిలే... ఇంతవరకు శద్ద పట్టాం. ఈ మాత్రం దాచిపెట్టాం.

“ఇది పెళ్లిసవారీ రంగుకుచ్చుల చెర్నాకోల, తీర్తానికి గజ్జెల చెర్నాకోల, రోజువాడిక్కి వారేసిన చురుకు చెంద్రకోల,” అంటూ ఛళ్‌మనిపించి నవ్వాడు.

భోషాణం ఇంకా ఖాళీ కాలేదు.

అక్షయంగా తీసినకొద్దీ కొత్తకొత్తవి వస్తూనే వున్నాయ్.

చిన్న జనపనార సంచిలోంచి భజనచెక్కలు, గజ్జెలపట్టీలు సందడి చేస్తూ బయటపడ్డాయ్.

పెదకాపు పోయిన నిధి దొరికినట్టు కళ్లు విప్పార్చి చూశాడు.

ఒక్కసారిగా పూనకం వచ్చినట్టు వీశడున్న భజన చెక్కల్ని యిట్టే కుడిచేత పూన్చి, వాటి చెంపచక్రాల్ని గలగల లగలగ లాడిస్తూ గొంతెత్తాడు-

“శ్రీమద్రమారమణ గోవిందో హరి...” అని అందుకున్నాడు.

'ఆయ్' అనే పెద్దరంకెతో కుడిపాదంతో నేలని గద్దించాడు.

*"గరుడగమన రారా, యేయ్!*
*శరణు...శరణు శరణూ శరణంటినిగద...రా!*
*రారా గరుడగమన..."*

పండరిభజనపాట మాంఛి రసావేశంతో చిందింది.

ఇంటావిడ ఆయన వెంట పెదాలు కలుపుతూ, నట్టిన చోటల్లా పదమందిస్తూ సందర్భంలో లీనమైపోయింది.

పచ్చని తోరణాల పందిట్లో ఒకనాటి సంప్రదాయం యీ జంట పుణ్యమా అని తిరిగి బొమ్మ కట్టింది!

దాన్ని బుజ్జమ్మ ఫొటోలకెత్తింది.

నా చిన్ననాటి జ్ఞాపకాల్లో జల్లులాడాను... చిందులేశాను.

మధ్యమధ్య అదనంగా బోలెడు విజ్ఞానం నాకు.

దూడలంటే... గిత్తలంటే... కోడెలంటే... ఎడ్లంటే... తేడా ఏంటో యెరుకైంది.

'ముకుతాళ్లెయడం, జతకలపడం, ఎలపట దాపట అర్థాలు- అన్నీ నాకు తెలిసొచ్చేశాయోచ్...' అంటూ అరిచేద్దామనిపించింది.

'అన్నీ గుర్తు రాసుకోవాలి. రేపటి తరానికి మన వైభవాన్ని, సంస్కారాల్ని నిండు దోసిళ్లలో అందించే బాధ్యతని నేనూ తీసుకోవా,'లని గట్టి మేల్ తలపెట్టా.

ఏమైనా నేను యీతరం సాక్షిని కదా!

నా ఆలోచనకి అడ్డం తగుల్తూ పెదకాపు-

"ఇదిగో యీ సన్నటియి ములుగర్రలు... కొంచెం లావుగా వున్నాయే ఇవి సాముకర్రలు... ఈ ములుకోలకి ఎండిముల్లు... కాపడిందా?"

-అనగానే తలదించి వాటి వంక చూశా.

"పాపం! ఎద్దుకేముల్లయినా నొప్పొకటే... అది మా బలుపు," అని తిట్టుకుని, అంతలోనే తేరుకుని-

"ఎదురుజాతి అడివికర్రలు. కణుపులు చెక్కి సాపుచేసి, కర్రలమీద చుక్కల ముగ్గులెక్కించి సోగ్గా తెచ్చేటోళ్లు చెంచుదొరలు. అందుకు యీట్ని చెంచుకర్రలంటాం."

నేను వాటిని దీక్షగా చూస్తుంటే గమనించి, "ఇది సాముకర్ర. దీన్ని తిప్పడం ఓ బెమ్మయిద్య. సాము తెలిసినోడి చుట్టూ నలుగుర్ని నించోపెట్టి, వాళ్లతో గచ్చకాయలు విసిరించేవాళ్లు. ఒక్కకాయ తగిల్తే ఒట్టు. ఎనక్కొచ్చి గచ్చకాయలవాన కురిసేది. తిప్పుతుంటే సాముకర్ర జోరీగలు ముసిరిన చప్పుడు చేసేది... అదీ దాని జోరు."

ఎవరో చెప్పినవి, ఎక్కడో చదివినవి, అన్నీ తెలిసినవే అయినా నోరు తెరుచుకు వింటున్నా. మన రైతువారీ వినోదవికాసాల ఆనవాళ్లని తనివితీరా కంటున్నా... సాక్ష్యాలతో సహా.

ఇంతలో ఇంకో కొత్త మెరుపు-

వెండిపొన్నుల చేతికర్రకి ఓ కొసన వెండిగజ్జెలు చిన్నగుత్తిగా వేలాడుతున్నాయ్.

ఆ పొన్నుకర్ర నా కందిస్తూ-

"ఇదీ... ఆ ఏడాది మన ముదురుచేను... యిప్పుళ్లేదులే... అమ్మేశాంగా... ఎకరాకి నికరంగా రెండుపుట్లకాడికి పండింది. అప్పట్లో ఎకరాకి పుట్టి, పుట్టింజిల్లర రాలడమంటే గగనం! అప్పుడేవన్నా, ఐబ్రీడిత్తులా, పిండెరువులా?

"ఆరోజు కళ్లంలో పంట తూకమేస్తంటే సుట్టుపక్కల రైతులు సూడొచ్చారు.

"ఇసయం ముందే తెలిసిన దాష్టీకపు కరణం మా వూరి కరణాన్ని ఎంటేసుకుని నేరుగా జీబుకారులో కళ్లంకాడికొచ్చాడు. ఈ నల్లచేవ చేతికర్రని నా సేతుల్లో పెడతా, 'మొత్తానికి పెదకాపు అనిపించావ్, భేష్,' అంటా బుజం తట్టాడు."

పొన్నుకర్ర గజ్జెలు ఔనన్నట్టు తలాడించి చిరుసవ్వడి చేశాయ్- చెయ్ మారుతూ.

చేతికర్రని అందుకున్నావిడ, మైనపు కాగితం తిరిగి దానికి చుట్టబెడుతూ- "జీబు దిగొచ్చిన ఆ తాసీల్దారుడుగారు యిదీన సేతికిచ్చి, అక్కడున్న బిళ్లబంట్రోతాయన కాణ్ణించి పచ్చరంగు ఖద్దరుశాల్వా తీసుక్కప్పాడు. ఇహ అంతా ఒకటే చప్పట్లు!" అన్చెప్పి, పెదకాపుని చురుక్కున చూసి- "నోరిప్పి సొంతం చెప్పవేం... అన్నిటికీ తూకమే... ఇశదంగా మన మాదవయ్యకి తెలవద్దా?" అని గసిరింది.

"ఎహె పోన్లే," అంటూ ముసిముసిగా సిగ్గుపడ్డాడు పెదకాపు.

వచ్చి, మాటలమధ్యన జొరబడ్డ బుజ్జమ్మ ఇద్దరికీ ముద్దొచ్చేసింది!

మెటికెలు విరిగిన చప్పుడు ఆపేక్షని వొలకబోసింది.

ముఖేముఖే సరస్వతీ...

నాకిదంతా మహదానందంగా వుంది!

సిగ్గుల నుంచి తేరుకున్న పెదకాపు-

"అటు శ్రీశైలం అడవుల్లోంచి చెంచులు ఏటా పంటరోజుల్లో వచ్చేటోల్లు. ఆసాముల అవసరాలు తెచ్చి ధాన్యానికి పరటా వేసేవాళ్లు. ఎదురుగొట్టాల్లో పుట్టతేనె, పశులవైద్యకానికి అడివి దినుసులు వచ్చేవి. ఇంకా పులిగోళ్లు, దుప్పికొమ్ములు, జింక శర్మాలు..." అంటూ ఆగి, స్తబ్దుగా ఎటో చూస్తూ ఉండిపోయాడు.

పెదకాపు వయసులో వుండగా, కోటయకొండ తిరనాళ్లకి ప్రభలు కట్టుకు వెళ్లినపుడు ఎడ్ల సిగమార్లు పట్టుకు దిగిన ఫొటో అద్దంకట్టి భద్రంగా ఉంది.

మంగళగిరి తిరనాళ్లలో మా ఊరి కనకతప్పెట్ల ముఠాతో తీయించుకున్న స్టూడియో ఫొటో చూశా.

పూర్తి అలంకరణలో ఉన్న జత ముందు ఠీవిగా నిలబడ్డ పెదకాపుని చూశా.

కాసేపు ఇద్దరం మాటల్లేకుండా ఉండిపోయాం.

"అసలుకైన జీవాలు లేకపోయాయ్. ఈ సరుకు మాత్రం మిగిలింది," భారంగా నిట్టూర్చాడు రాఘవయ్య.

"సజీవతకు మార్పు సహజం. నాగరికతకి ప్రాణం వుంది కదా, మార్పు తప్పదు కదా," అన్నాను.

ఆయనేమీ వూరట పడలేదు.

పైగా 'అహా... ఔనా' అన్నట్టొక చూపు చూశాడు పెదకాపు.

ఆ చూపుతో నేను చిత్తయ్యాను.

* * *

పెద్దాయన చెప్పినట్టే సమస్తం తీసుకుని, ఇక్కడ గాడిపొయ్యి వెలిగించకుండానే గుడికి తరలారు అందరూ.

"అమృతమస్తు... శ్రీకృష్ణార్పణమస్తు... శుభమస్తు..."

కృష్ణస్వామి ఆశీర్వచనాలు పెడుతూ స్వయంపాకాలు దింపించారు. గర్భగుడి సరుకు సంబారాలతో నిండిపోయింది. అందర్నీ పేరుపేరునా పలకరిస్తూ, ఆప్యాయంగా యోగక్షేమాలడిగారు.

ఓణీల పెళ్లికూతురి తల నిమిరి, "ఈ అమెరికాపిల్ల ముట్టుకుంటే మాసిపోయేట్టుంది... మా తల్లి రాధమ్మ..." అన్నారు మురిపెంగా కృష్ణస్వామి.

"అక్కడి నీళ్లకి, ఆ గాలికి మన క్రిష్ణుడుగారెళ్లినా తెల్లబడి నున్నగా వస్తారు... అందుట్లో పెద్ద బెమ్మాండమేం లేదు," అన్నాడు శివ.

"ఎందుకురా సాంబయ్యా అట్టా మాటాడతావ్," అంది చిట్టెమ్మ దీర్ఘాలు తీస్తూ.

రెండు పెద్ద నులక ఉండలు కావిడేసుకొని ఘుమఘుమలాడుతూ రాఘవయ్య ఆలయంలో అడుగుపెట్టాడు.

రాక గమనించి, "అబ్బో! మా పెదకాపు అరుగు దిగివచ్చాడే," అన్నాడు పెదస్వామి.

"ఇదిగో... స్వామీ! దేవుడి పవళింపు సేవకి అడిగావని కర్పూరంతో పేనా," అంటూ దేవుడి ముందు పెట్టాడు, ఇత్తడి కడవలంత నులక వుండలు.

కృష్ణస్వామి పెదకాపు రెండు చేతులూ అందుకుని కళ్లకి అద్దుకున్నారు- ఏవో మంచి దీవెనలు గొణుగుతూ.

"స్వామివారి తూగుటుయ్యాల చక్కీ నువ్వే అల్లిపెట్టాలి సుమా... ఆ విద్య నీదే రాఘవయ్యా," అన్నారు అభిమాన స్వరంతో.

"నువ్వంటే ఆ దేవుడన్నట్టేగా..." నిండుగా బదులిచ్చాడు పెదకాపు.

ఇష్టాగోష్ఠికి స్వస్తి పలికి, అందరి గోత్రనామాలతో వేణుగోపాలస్వామికి అష్టోత్తరం జరిపించారు.

హారతులు, నివేదనలు పూర్తయినాయ్.

"పునర్దర్శనప్రాప్తిరస్తు," అంటూ అక్షతలు చల్లుతూ అందరికీ వీడ్కోలు పలికారు అర్చకస్వామి.

పచ్చి తామరాకులలో వేడి చక్రపొంగలి ప్రసాదం అందరికీ ముట్టింది.

బయట బావిగట్టు దగ్గర ప్రసాదం తిని చేతులు, మూతులు కడుక్కున్నారు.

అంతా బయలుదేరారు.

తండ్రీ కూతుళ్లు వెనక్కి చిక్కారు.

పూజారిగారి ఇంటివైపు నడిచారు.

ఇంటావిడని, ఇంటి కోడలిని ఓణీల పేరంటానికి బొట్టుపెట్టి ప్రత్యేకం పిలిచారు.

"పెద్దస్వామిని నే పిలవను... చిన్నాయన సంగతి సాంబయ్య చూసు కుంటాడు," అని నవ్వుకుంటూ బయటకు నడిచాడు పెదకాపు.

రాజగోపురం దగ్గర ఆగాడు.

'గుడికొస్తే కూసేపు కూకోవాలంట,' అనుకుంటూ పైకండవాతో అక్కడి అరుగు దులుపుకుని చతికిలపడ్డాడు.

పక్కన కూతురు కూచుంది.

గుడిపావురాల రెక్కల చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

చల్లటి గాలి తోలుతోంది.

*"నిమ్మా పండిచ్చెదా నిలిచి ముద్దీయరా*
*దబ్బా పండిచ్చెదా దరిచేర రారా*
*యెన్నాముద్దిచ్చెదా ఎన్నంటి ఉండవా*
*నా పాలిదేవుడా నాసామిరంగా..."*

పెదకాపు గొంతెత్తి భజనపాట అందుకున్నాడు.

రాజగోపురం వంత పాడింది.

చిట్టెమ్మ ఆలకిస్తూ దిక్కులు చూస్తోంది.

తండ్రి కుశాలుగా ఉన్నాడనుకుంది.

పెదకాపు ఏదో గుర్తొచ్చినట్టు ఒక్కసారి పాట కత్తిరించి, కూతురు వంక తిరిగి, "శివయ్య అన్ని సంగతులు చెప్పే ఉంటాడు. ఇపుడు నీ మూడెకరాల బూమికీ వచ్చే పైకం ఎట్టా సెయ్యాలో ఏందో చెప్పుకో... అల్లుడితో, మీ వాళ్లతో సయిస్తరంగా మాటాడు కుని చెప్పు... మళ్లీ మాటరాకుండా చూసుకోమ్మా," అనగానే-

"రాదులే... ఎందుకొస్తది," అని చిట్టెమ్మ రెండుసార్లు గొంతు సకిలించుకుంది. ఏదో చెప్పాలని తటపటాయిస్తోంది.

అంతలోనే గొంతు పెగిలించుకుని-

"...అయితే మరి నాలుగో ఎకరం మాటేంది నాన్నా?" అంది మృదువుగా.

ఆ మాట రాజగోపురానికి తగిలి తగిలి, తిరిగి తిరిగి, 'నాలుగో ఎకరం' నాలుగు సార్లు వినిపించింది పెదకాపుకి.

ఛ్ఛెళ్లున గుర్తొచ్చింది.

గూబ అదిరింది!!!

ఔను! ఏడేళ్లు ఎనిమిదేళ్లు పంటల్లేవని పలసాయం ఇవ్వలేకపోయిన మాట నిజం!

'నువ్వైనా మొగుడిచాటు పిల్లవి. పుట్టింటోళ్లు ఇవ్వలేదనో, ఆడపిల్ల సొమ్ముకి ఆశపడ్డారనో మాట రాకోకూడదు. ఎవరికో అమ్మి నీకు డబ్బు కట్టే బదులు, నీకే ఒక ఎకరం గట్టు పెడతాంలె,'మ్మన్న మాట వాస్తవం.

'నేనేవన్నా అడిగానా పెట్టానా... అది మాకేవన్నా ఆదరువా... ఇంకెప్పుడూ ఆ మాటనద్దు... మర్చిపోండి,' అని చిట్టెమ్మ చనువుగా పుట్టింటిని కేకలేసిన మాట నిజం.

అనుకున్న మాటలన్నీ ఒక్కసారి చెవుల్లో గింగిరాలు తిరిగాయ్.

రాఘవయ్య లేచి నిలబడి కండవా దులిపి బుజాన వేసుకుని, "అట్టాగే... ఆడపిల్ల సొమ్ము మాకెందుకు తల్లీ," అన్నాడు.

గుడిపావురాల్తో శ్రుతి కలిపి మూలిగాడు.

ఇంకే మాటామంచీ లేకుండానే తండ్రీకూతుళ్లు ఇంటికి చేరారు.

* * *

పెదకాపు మనసు చెదిరిపోయింది.

కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు.

బుర్రకి శ్రుతి పోయింది.

గుండెకి లయ తప్పింది.

'అప్పుడు ఎకరా అంటే ఎకరాయే... ఇప్పుడు ఎకరా అంటే... అమ్మో... శానా...! దానికోసం చిట్టెమ్మ అప్పుడేదో మాటవరసగా అనుకున్నదిగాని వుప్పుడు గట్టిమాటగానే తీసుకుంది. సాజమే గందా...' తండ్రి తనని తాను సంబాళించుకుంటున్నాడు.

పెదకాపు నాలుగో ఎకరాన్ని వొట్టిమాటగా వదిలేసినందుకు చచ్చేంత సిగ్గ పడ్డాడు. చిట్టెమ్మతో గుర్తుచేయించుకున్నందుకు తీవ్రంగా రోషపడ్డాడు. ఇల్లువాకిలి కలయతిరిగాడు. కలవరపడుతున్నాడు.

ఇంటెనకాల గాడిపొయి మీద వంటలయిపోతున్నాయ్. ఎక్కడికక్కడ అడ్డంగా షామియానా తెరలు కట్టారు. తెరల్లోంచి ఆడామగా కీసరబాసరగా అంటున్న మాటలు వినిపిస్తున్నాయ్. గాడిపొయి మంటలు నాలికలు సాచుతూ పాత్రల పైకి ఎగబాకుతున్న నీడలు తెరల్లోంచి కనిపిస్తున్నాయ్.

పెదకాపు అరుగుమీద కూచోపడ్డాడు. రెండు చేతులూ వెనక్కి ఆన్చి పైకి చూశాడు.

సడీసప్పుడూ లేకుండా పైనించి దిగిన డేగ వస్తాదులాంటి పాముని ఎగరేసుకు పోడం కళ్ల ముందు మెదిలింది.

తుళ్లిపడ్డాడు.

సాంబయ్య కోసం చూశాడు. దొరికాడు. పిలిచాడు.

"ఒరే శివయ్యా... సాంబయ్యా... వుప్పుడు మనం ఆడపిల్లకి నాయంగా, సముద్రాలవతల ఉన్నా సమంగా వాటా పెట్టాలి గందా... నీదో వాటా, నాదో వాటా, చిట్టెమ్మకో వాటా" పెద్దగా నవ్వి - "సాంబా, ఆ లెఖ్ఖన అక్కాయ్‌కి నాలుగో ఎకరం ఇచ్చి తీరాల్రా," అనేసి కొడుకు మాటకోసం ఆందోళనతో ఎదురుచూశాడు.

"సర్లే... అది ఎప్పుడో అనుకున్నదేగా..." అన్నాడు సాంబ అందులో కొత్త ఏవుం దన్నట్టు.

వూహించని జవాబుకు పెదకాపు తత్తరపడ్డాడు.

"అనుకున్నామా... అదెట్రా..."

"మనం కాదు... అక్కాయియోళ్లు."

"అదెట్రా..."

"అదంతే... నీకు పొద్దునే తెలిసింది. నాకెప్పుడో తెల్సు."

"అదెట్రా..."

"మా వాటాకి కోటిన్నరపైగా వస్తంది. బెంగుళూరులో మంచిచోట అపార్ట్‌మెంట్ చూడమన్నారంట... మన బేరం కుదిరినరోజే అక్కాయి బావయ్య చెప్పారంట వెంచ రోళ్లకి. లెఖ్ఖ సరిపోయిందిగా." అన్నాడు శివ.

"పోన్లే... మనకి మాట రాకూడదు... మన సంగతి దేవుడే చూసుకుంటాడు... నాకా దైర్నం ఉంది..." లేని గాంభీర్యం తెచ్చిపెట్టుకుంటూ అన్నాడు పెదకాపు.

"సర్లే," అంటూ సాంబయ్య కదలబోతుంటే, "ఒరే సాంబా... బాగా గ్యాపకం పెట్టుకో... నాకేదైనా తేడా పడితే, నన్ను... ఇదిగో... ఈ మానంది బండమీద ఓపాలి పండుకోబెట్టు... నా చేతిలో మన రంగుకుచ్చుల చెర్నాకోల... పెట్టు... శంషేరుగా... ఆ... అంతే!" అర్థంలేని నవ్వుతో కళ్లు తుడుచుకున్నాడు.

"సర్లే... ఇప్పుడేనా అయన్నీ... శుబమా అని పండగేళ," అని నోరు చేసుకున్నాడు సాంబయ్య.

రాఘవయ్య కళ్లు జ్యోతుల్లా ఉన్నాయ్. కండువాతో కళ్లొత్తుకున్నాడు.

తండ్రి అయోమయంగా ఉన్నాడని ఆయన చెయి పట్టుకుని అరుగుమీద కుదురుగా కూర్చోపెట్టి పందిట్లో పనులు సంబాళించడానికి వెళ్లాడు సాంబయ్య.

ఇంటావిడ గ్లాసునిండా మజ్జిగ తెచ్చిచ్చింది.

గటగటా తాగేసి ఖాళీగ్లాసు చేతికిస్తూ, "మన శివయ్య దానికేవనలా... అదేనే... ఎర్రిమొగమా... నాలుగో ఎకరాకి..." అంటూ వస్తున్న పొడినవ్వుని కండువాతో తుడుచుకున్నాడు పెదకాపు.

"దానికేనా నీ నవ్వు... ఈ సంబడం," అనుకుంటూ వెళ్లిపోయిందావిడ.

రాఘవయ్య మనసులో కొత్తముడి వీడింది.

'నీళ్లకంటే రకతం చిక్కన, పచ్చనోట్ల రంగులు తేనెకంటె చిక్కన,' విచ్చినముడి లోపలి మాటలుగా మనసుకి తోచాయ్.

పెదకాపు నోరిప్పి, నోటినిండా నవ్వుకున్నాడు. రెండు చేతులూ తిప్పుకుంటూ, పిచ్చిగా... పిచ్చిపిచ్చిగా ఇకిలించాడు.

* * *

తెరల్లోంచి తుకతుకా ఉడుకుతున్న చప్పుళ్లు వినిపిస్తున్నాయ్.

వంటవాళ్ల కబుర్లు, మధ్య మధ్య కేకలు జోరుగా ఉన్నాయ్.

పెదకాపు బుర్రలో ఏ ఆలోచనా లేదు. డొల్లగా వుంది.

ఉన్నట్టుండి ఒక్కసారి ముక్కుపుటాలెగరేశాడు.

మళ్లీ... మళ్లీ ఏదో గిట్టని వాసన తగుల్తున్నట్టు మొహం చిట్లించాడు.

ఒక్క ఉదుటున లేచాడు.

రెండంగల్లో అడ్డాలు విదిలించుకుని లోపలికి వెళ్లాడు.

గనగనలాడుతున్న గాడిపొయి మీద రాగికాగులో ఉలవలు ఉడుకుతున్నాయ్.

చూసి ఉగ్రుడైపోయాడు.

నిలువెల్లా వొణుకుతూ-

"ఎవఁడ్రా యివి చెప్పింది... ఎవఁడ్రా యియి తెచ్చిం,"దని అరుస్తూ పళ్లు కొరుకుతూ ఎక్కడలేని శక్తి కూడతీసుకుని కాగుని ఒక్క తన్ను తన్నాడు పెదకాపు.

తుకతుకలాడుతూ గిన్నె తలకిందులైంది.

గాడిపొయిలోంచి వెచ్చటి ఆవిర్లు పైకి తన్నాయి.

ఎక్కడివారక్కడ బొమ్మల్లా నిలబడిపోయారు.

ఆవిర్లలోంచి పెఠేల్మని పెద్ద చప్పుడుతో కణకణలాడే బొగ్గులు పైకి చిమ్మాయి.

ఎవరికీ ఏమీ తెలియడంలేదు.

యజమాని చేష్టలు అక్కడివారిని భయపెడుతున్నాయ్.

పెదకాపు గాడిపొయ్యికి అటో కాలు ఇటో కాలు వేసి, తటాల్న వంగి లోపల కాలే కాలే నాగలిదుంపని రెండు చేతుల్తో బలంగా పట్టి బయట పడేశాడు.

పట్టుతప్పిన కాళ్లతో తూలి, గాడిపొయిలో పడబోతున్నాయన్ని లాగి బయట నిలబెట్టారు అక్కడి వాళ్లు.

మెల్లగా అరుగు మీదికి చేర్చారు.

ఇందాకన మంటల్లో పెతేల్మని నాగలికఱ్ఱ కట్టు తెంపుకుంది.

ఇపుడు ఆకారం చెడి బయటపడ్డ నాగలిదుంప నల్లటి పొగలు, సెగలు కక్కుతోంది.

రాఘవయ్య అరిచేతులు బొబ్బలెక్కాయి.

సూటిగా సెగ తగిలిన కళ్లు వాచిపోయాయి.

అరికాళ్లు కమిలాయి.

అంతా చుట్టూ చేరారు. మొహం మీద నీళ్లు జల్లారు.

నిర్ఘాంతపోయిన పందిరిని నిశ్శబ్దం అలుముకుంది.

"మీయమ్మ కడుపుకాలా... దాన్నంట్రా పొయిలో ఏసేది... కూడు... గుడ్డ... అన్నీ అదేగదంట్రా ఇచ్చేది... మనకి సీతమ్మ తల్లి నిచ్చిందిరా..." పెదకాపు గొంతు పెగుల్చుకుని, జీరతో పొడిపొడిగా రొప్పుతూ అనడం వినిపించింది.

చింతనిప్పుల్లాంటి కళ్లు మూతలు పడుతున్నాయ్.

క్షణంలో ఊరంతా వచ్చి వాలింది.

కృష్ణస్వామి వస్తూనే, "శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే భోగీంద్ర భోగమణి రాజిత పుణ్యమూర్తే," అంటూ కరావలంబ స్తోత్రం అందుకున్నారు.

ఒక్కసారిగా అక్కడికి ధైర్యం దిగివచ్చినట్టయింది.

నృసింహ స్తోత్రాన్ని ఆపకుండా చదవమని నాకు సైగ చేశారు నాన్న.

"బ్రహ్మేంద్రరుద్ర మరుదర్క కిరీటకోటి..." - నేనందుకున్నాను.

అప్పటికే నాన్న చొరవచేసి అందర్నీ దూరంగా జరిపేశారు.

పెదకాపుని కారులో పడుకోబెట్టారు.

కారు ఆందోళనగా బయలుదేరింది.

* * *

కారు వెనకసీట్లో పడున్న రాఘవయ్య బాధగా మూలుగుతున్నాడు. తల కృష్ణస్వామి ఒడిలో ఉంది.

పెదస్వామి కరావలంబ స్తోత్రం స్మరిస్తూ, తల నిపురుతూ కూర్చున్నారు.

"...దయాళో లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్," నేను కన్నులరమోడ్చి స్తోత్రపారాయణలో వుండిపోయాను.

సాంబయ్య బిక్కచచ్చి వున్నాడు.

దారి పొడుగునా పెదకాపు మూలుగుల మధ్య ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు.

కృష్ణస్వామి చెవొగ్గి వింటూ, "వూఁ" కొడుతూ, ప్రశ్నలు వేస్తూ రోగి అపస్మారకం లోకి వెళ్లకుండా కాపాడుకొస్తున్నారు.

అంత కంగారులోనూ నేనది గమనిస్తూనే వున్నా.

ముందే ఫోన్ వెళ్లిందాన్నిబట్టి ఆస్పత్రి ఎదురొచ్చి అందించాల్సిన తక్షణవైద్యం అందించింది.

వెనకాలే నాలుగు కార్లలో సొంతవాళ్లు, పొరుగువాళ్లు వచ్చి చేరారు.

ఆసుపత్రి క్రిటికల్ కేర్ యూనిట్‌లో చేర్చారు. రాఘవయ్యకి జరగాల్సిన పరీక్షలు జరుగుతున్నాయ్. వైద్యబృందం చికిత్స చేస్తోంది. నొప్పులు తెలియకుండా మత్తిచ్చామని, ఏమీ పర్వాలేదని డాక్టర్లు చెప్పారు.

దారిపొడుగునా పెదకాపు విడిచిన కన్నీళ్లతో కృష్ణస్వామి పంచె కుచ్చిళ్లు తడిసి ముద్దయినాయి.

పెదస్వామి పూర్తిగా అలిసిపోయి కనిపిస్తున్నారు.

బాగా తెలిసిన అక్కడి డాక్టర్‌తో మాట్లాడి, ఆయన పర్వాలేదన్నాక నేను, నాన్న వెనక్కి బయలుదేరాం.

కారులో మాటాపలుకూ లేకుండా మాగన్నుగా పడుకున్నారు పెదస్వామి.

* * *

మేము తిరుగు ప్రయాణంలో ఉండగా శివ ఫోన్ మోగింది.

"...మత్తులో పెట్టారు... వేరే గొడవలేం లేవంట... చాలా జాగ్రత్తగా చూడాలి... ఆ గదిలోకి ఎవరూ తొంగి చూడద్దంట... చుక్కలు ఎక్కిస్తున్నారు... మొత్తానికి నిమిషంలో అంతా గందరగోళం చేసేశాడు..." ఉసూరుమన్నాడు శివ.

"పోన్లే... కొండలా వచ్చి మంచులా కరిగిపోయింది... అదే సంతోషం," అన్నాను.

"పెదకాపు కోట్లకి పడగెత్తాడని ఒకటే ఉప్పత! ఆ దెబ్బే కొట్టి, ఆ దిష్టి ఆయన మీంచే పోయింది..." అన్నాడు శివ.

"అంతే అనుకోవాలి. ఇంకా పట్టుపాగా చుట్టి, కుచ్చుల చెర్నాకోలతో నిలబడ్డ పెదకాపు నిలువెత్తు ఫ్లెక్సీ, చుట్టూతా ఎడ్ల అలంకారాలు- దీన్ని మీ వాకిట్లో చూసిన వారంతా రాఘవయ్య జాతకుడనుకున్నారు. కొంత అదీ వుంది," అన్నాను.

"ఔనౌను... పైగా మా బుజ్జమ్మ తీసింది దాని బుజ్జిచేతుల్తో అని మురిసిపోతా ఆ ఫ్లెక్సీని చూసుకుంటానే వున్నాడు. ఆయన దిష్టే సగం కొట్టుంటది," అంటూ వంత పాడాడు శివ.

వెంటనే గొంతు తగ్గించి, "ఇదసలు ఎందుకు జరిగిందో ఏమోగాని, మా బావయ్య మాత్రం - మనకీ మనకీ ఏవన్నా ఉంటే మాటల్లో తేల్చుకోవాలిగాని, చేతులు పొయిలో పెట్టుకోడమేందిరా అని అబాండమేశాడు."

"... ... ..."

"మా అక్కాయ్ తెగ ఏడుస్తాంది..."

"బాధ ఉంటుందిలే... పాపం!... బాగా తండ్రి గారంతో పెరిగిన పిల్ల," అన్నాను సానుభూతి స్వరంతో.

"సాంబా... ఇప్పుడటాత్తుగా రిజిస్ట్రేషన్ ఆగిపోయె... నాన్నకి మళ్లీ వేలిముద్దర్లు ఎప్పటికి మొలుస్తాయో తెలవదాయె... నే మళ్లీ అంతదూరం నించి పడి రావాల్రా... ఈసారి టిక్కెట్లు నేనే పెట్టుకోవాల్రా... బావయ్య నానా మాటలూ అంటున్నాడు... యిదే చెప్పి చెప్పి అక్కాయేడుస్తాంది."

"వడ్లగింజలో బియ్యపుగింజ... నువ్ నిబ్బరంగా ఉండ,"మని చెప్పి ఫోన్ పెట్టేశా.

కారు గుడి ఆవరణలో ఆగింది.

పెదస్వామి కళ్లు తెరిచి, "శ్రీకృష్ణ శ్శరణమ్ మమ," అంటూ కారు దిగారు.

* * *

వస్తూనే బావిగట్టు మీద కూచున్నారు కృష్ణస్వామి. ఆయన సైగతో చేద అందుకుని నీళ్లు తోడి పొయ్యడం మొదలుపెట్టాను.

ఎప్పటికోగాని నాన్న సేద తీరలేదు.

తిరిగి మాటల్లో పడ్డారు నాన్న.

నీళ్లు చేది అందిస్తూనే, "పాపం! ఏవంటాడు పెదకాపు... మీకేమన్నా అర్థమైందా?" అని అడిగాను.

"ఏవంటాడు... 'మా అమ్మ చితి మీంచి వచ్చిన కవురు కంపే... అప్పుడొచ్చిన చప్పుడే,' అని సంధిప్రేలాపనల్లాగా ఏవేవో...

"పాపం! తల్లి కపాలమోక్షం గుర్తొచ్చి పెదకాపుని బాధ, భయం, బెంగ చుట్టేశాయ్. మతి తప్పినవాడల్లే అదే, అదే కలవరించాడు. వున్నట్టుండి, 'వచ్చె... వచ్చె... డేగ... అమ్మో డేగ... నాగన్నా దాంకో,' అంటూ అరిచాడు. 'తప్పు సామీ... నాదే తప్పు... నాలుగో ఎకరం మర్చిపోడమేంది... డబ్బు గడ్డి తినిపిస్తది,' అని పసివాడల్లే ఏడ్చాడు పెదకాపు.

"మాధవా, వీళ్లు మట్టిమనుషులయ్యా. రెండు తరాల మయాన చిక్కుకున్న వాళ్లు... గడియారం ముల్లు విరిచేస్తే కాలం ఆగిపోతుందా... ఏవిటో సున్నితమైన మనసులు. గంగడోళ్లు, పాలపొదుగులు నిమిరిన చేతులు... కరుకుతనం బొత్తిగా తెలియదు."

నాన్న మధ్య మధ్య గోవిందనామాలు గొణుగుతూ, తల మీద చేదలు వొంపుకుంటూనే ఉన్నారు.

"డబ్బంత దుర్మార్గమైన దినుసింకోటి లేదుట. చెట్లకి డబ్బులు కాస్తే, కొమ్మలన్నీ కొట్టుకు చస్తాయని జోస్యం చెప్పాడు.

"నేను, 'తెలిసి తెలిసి చేతులెందుకు కాల్చుకున్నావ్ కాపూ,' అని అడిగితే, 'చేసేది, చేయకలిగింది లేనప్పుడు... అంతే,' అని బావురుమన్నాడు.

"'ప్రత్యామ్నాయం లేనప్పుడు ప్రాయశ్చిత్తమే మందు' -ఇదే పెదకాపు ఆత్మ ఘోష.

"ఇంక చాలయ్యా... తేలికపడ్డాను... పరాత్పరా... పరంధామా..." అంటూ లేచి, వొంటి మీదే ధోవతి పిండుకుంటూ తడి అడుగులేసుకుంటూ చిరువొణుకుతో ఇంట్లోకి నడిచారు కృష్ణస్వామి.

* * *

పెదస్వామి పొడి మడిబట్టలతో, తీరుగా దిద్దిన తిరునామంతో బయటకు వచ్చారు.

"శ్రీవత్సం... కౌస్తుభం... మాలాం..." యజ్ఞోపవీతం తిప్పుకుంటూ బుజం మీది తుండుతో తల తుడుచుకుంటున్నారు.

సూర్యుడు గోపుర కలశం మీంచి ఒక వీసం పడమటికి మొగ్గాడు.

రావిచెట్టు గాలికి పిచ్చిసందడి చేస్తోంది.

కొమ్మల మీది కాకులు అరుస్తున్నాయ్.

శివ వెతుక్కుంటూ పరుగున గుళ్లోకొచ్చాడు.

అంత దూరాన్నించే పెదస్వామి చేసైగతో శివని పలకరించారు.

"కౌమోదకీం... సుదర్శనం... పాంచజన్యం..."

ఏమీ ఫర్వాలేదని చిరునవ్వుతో, రెండు చేతులూ అభయముద్రలో వుంచి సంబాళిస్తుండగా -

శివ చెంగున పెదస్వామి ముందు వాలాడు.

ఆయనని నిస్సంకోచంగా గట్టిగా చుట్టుకున్నాడు.

రివటల్లే వొదిగిపోయాడు.

శివలో ఏడుపు వరదై కట్టలు తెంచుకుంది.

స్వామి శివను పొదువుకుని వెన్ను నివురుతున్నారు.

"కరారవిందేన పదారవిందం ముఖారవిందేన..."

శివ తలని ఆయన గుండెల మీద అణిచి వుంచారు.

"వినివేశయంతం వటస్య పత్రస్య..."

కృష్ణస్వామి శివ చెంపకు అరచెయ్యి ఆన్చి, మనసా వాత్సల్యం కురిపించారు.

ఎడతెగని ఎక్కిళ్లతో శివ వెన్ను ఎగిరెగిరి పడుతోంది.

"వటస్య పత్రస్య పుటే శయానాం..."

శివ కళ్లు ధారలు కడుతున్నాయ్.

పెదస్వామి ఓదార్చలేదు... అసలు ఏడుపుని పట్టించుకోలేదు.

"బాలం... ముకుందం... మనసా స్మరామి..."

సాంబశివరావు కుళ్లి కుళ్లి ఏడ్చాడు.

కుళ్లంతా వదిలిపోయేలా ఏడ్చాడు.

ఎన్నేళ్లుగానో పేరుకున్న బాధలు, ఉక్రోషాలు, అవమానాలు కరిగి కన్నీళ్లుగా కొట్టుకుపోయేలా ఏడ్చాడు.

ఇన్నాల్టికి కళ్లారా తనివితీరా ఏడ్చేందుకు శివకి దేవుడల్లే ఓ దిక్కు దొరికింది.

ఒక్కసారి చల్లగాలి తగిలింది.

దాంతో శివ జడివానగా కురిసి, పిండిన మబ్బల్లే వొరుపున పడ్డాడు.

బుజం మీది తడితువ్వాలుతో శివ కళ్లొత్తి, నుదురు తుడిచారు స్వామి.

"వచ్చిన ఆపదేమీ లేదురా శివయ్యా," అని కొండంత ధైర్యమిస్తూ ఓదార్చారు.

శివ యిపుడు- అప్పుడే మొవ్వువీడిన మెట్టతామరలా, పులుకడిగిన ముత్యంలా ఉన్నాడు. ఒకడుగు వెనక్కి వేసి ఒకసారి తల విదిల్చి, వేళ్లతో జుట్టు పైకి అనుకున్నాడు.

"...మళ్లీ మా నాయన మునుపటిమల్లే నులక పేన్తాడా పెదసామీ," చేతులు జోడించి దీనంగా అడిగాడు శివ.

కృష్ణస్వామి శివని దగ్గరికి తీసుకుని తల నిమురుతూ ధైర్యవచనాలు కురిపించారు -

"ఓ బెమ్మాండంగా... చందన కర్పూరాలు కలగలిపి, మెరిసే జలతారు పోగులతో నీ కూన ఉయ్యాల కోసం పనితనమంతా పెట్టి పేన్తాడు శివయ్యా... ఇప్పుడు మా పెదకాపువి నిప్పులు కడిగిన చేతులు...!"

: కృష్ణమ్ వన్దే జగద్గురుమ్ :

---

**పూసిన తంగేడు** - విరగపూసిన పచ్చనిపూలతో తంగేడుచెట్టు సదా కళకళలాడుతూ వుంటుంది.

**పులికాపు** - ఉత్సవమూర్తులను, దేవతార్చన సామగ్రిని చింతపండుతో శుభ్రంగా తోమి నిగనిగలాడేట్లు చేయడం (శ్రీవైష్ణవ పరిభాష)

**పడి** - ముఖద్వారపు గడప (శ్రీవైష్ణవ పరిభాష)

**ఏరువాక** - వైశాఖపూర్ణిమ. పొలంపనుల ఆరంభ ముహూర్తం. ఏరు అంటే ఎద్దుల జత. ఇప్పటికీ శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలలో ఈ అర్థంతో ఆ మాట వాడుకలో ఉంది. ఏరుతో సాగే దారి ఏరువాక.

**తెల్లగొడ్డు** - ఆవులు, ఎద్దులు (దున్నపోతుల్నీ, గేదెల్నీ నల్లగొడ్డు అంటారు)

**తోడాలు** - వెండి కడియాలు. పందెంలో గెలిచిన ఎడ్ల కాళ్లకి బహుమానంగా వేస్తారు.

**మాటలకోరు** - మాటల ఘాటు

**బిళ్లంగోడు** - గోటిబిళ్ల. పల్లెటూరి ఆట. పెద్దకర్రతో చిన్నకర్రని వెంటపడి వెంటపడి కొడతారు.

**మంచె** - రైతులు చేను కాపలాకోసం ఓ మూల ఎత్తుగా పందిరిలా వేసుకుంటారు. దానిమీద నిలబడి అరుస్తూ వడిసెలతో పిట్టల్ని తోలతారు.

**గొరకొయ్యలు** - రాత్రివేళ పొద్దును సూచించే నక్షత్రాలు, వేగుచుక్కలు.

**వరదగుడి** - వర్షాకాలం రాత్రివేళ చంద్రుడి చుట్టూ దగ్గరగా కాంతి గుడికడితే దూరంగా (అంటే కొన్ని రోజుల తర్వాత) వాన పడుతుందనీ, దూరంగా వెలుగులు గుడికడితే దగ్గర్లో (రేపో మాపో) వాన పడుతుందని రైతులు సూచనగా భావిస్తారు.

**వార్నిపీట** - అరక కట్టినప్పుడు నాగలికి కాడిని అనుసంధానం చేసే కొయ్యపనిముట్టు.

**కొలగారాలు** - ధాన్యరూపంలో మిరాసీల చెల్లింపులు.

**తాటికర** - తాడిచెట్ల ప్రహరీ

**కాకిబొడ్డు** - వర్షరుతువులో పందిరి గుంజలకి పట్టే ఒకరకం నాచు (ఫంగస్). గోరింటాకు రుబ్బేటప్పుడు 'కాకిబొడ్డు' అనే యీ ఫంగస్‌ని అందులో వేస్తే, యిది వుద్దీపకంగా పనిచేసి గోరింట బాగా పండుతుంది. విశ్వనాథవారు 'తెలుగు ఋతువులు' లఘుకావ్యంలో దీని ప్రస్తావన తెచ్చారు.

**ఉలవల్లో కూరుకుపోయాడు** - ఉలవల పరిమాణం, సాంద్రత, నునుపు, గుణాలవల్ల బరువు యిట్టే రాశిలో కూరుకుపోతుంది.

**అఱ్ఱు** - ఎద్దు మెడ భాగం. కాడి వేసే చోటు.

**రాగుల మంచం** - మెట్టగోగుల నారతో పేనిన నులకతో అతివత్తుగా దీన్ని అల్లుతారు. రాగులు, సజ్జలు లాంటి తృణధాన్యాలను ఆ మంచం మీద ఏ వస్త్రం లేదా గోతం లేకుండా ఆరబోసుకోవచ్చు. ఒక్క గింజ కూడా కిందికి జారదు. రాగులమంచం చిక్కని అల్లిక ఓ ప్రత్యేక శిల్పం.

**బొమ్మంగారి నాటకం** - రాత్రంతా సాగిసాగి సూర్యోదయం దాకా నడుస్తుంది.

**కొష్ఠం** - గొడ్ల చావిడి

**చిడతలు, వసికర్రలు** - ఎడ్లబండి విడిభాగాలు. బండి కాడికి చివర్న వుంటాయి చిడతలు. ఎద్దుల మెడపట్టెడల్ని పట్టి వుంచుతాయి. బండిజల్ల కదలకుండా వుంచడానికి బండిచట్రం ఇరువైపులా వసికర్రలు దన్నుగా నిలబడి వుంటాయి.

**దాణాలు** - పశువులకు పెట్టే గుగ్గిళ్లు వగైరా.

**గైరు** - హెచ్చు, అధికం

**కర్పూరపు నులక** - ముద్దకర్పూరంతో నులక పేనడం ఒక సంప్రదాయం. గుంటూరు జిల్లా పొన్నూరు మరికొన్ని ప్రాంతాల్లో కొత్త అల్లుడి మంచానికిచ్చే నులకని గారంగా, గౌరవంగా కర్పూరంతో పేనడం రివాజు. ఇంకా పల్నాటిసీమలో దుర్గి వేణుగోపాలస్వామి పవళింపుసేవల మంచపుచక్కీలను కర్పూరపు నలుగుతో పేనడం ఆలయ సంప్రదాయం. ఇది చెన్నకేశ్వరుని భోగం కూడా. ఇది వైష్ణవ సంప్రదాయం.

**ముస్తాగా** - పూర్తిగా, అణాపైసలతో సహా.

**నారసింహపొద్దు** - దేవుడు నరసింహావతారమెత్తిన పొద్దు. (మూడుపొద్దులూ ముడిపడే వేళ)

**శ్రీకృష్ణభోగం కుచేలభాగ్యం** - అటుకులు అనే అర్థంలో కట్టినమాట.

**మోయిన్లు** - స్వయంపాకాలు, బంతి భోజనాలకు రానివారికి పంపే వంట సంబారాలు.

**భోషాణం** - సరుకు దాచుకునే పెద్ద కొయ్యపెట్టె (భోషాణం అంటే పెద్దది అని రూఢి అర్థం వుంది)

**జోగీజోగడాలు** - కొట్టొచ్చినట్టు కనిపించే బరువైన అలంకరణ వస్తువులు

**పుట్టి** - 13 బస్తాల ధాన్యం. ప్రాంతాన్ని బట్టి కొలతలు మారవచ్చు. చాలా, ఎక్కువ అని కూడా అర్థం. ఉదా : పుట్టెడు దుఃఖం.

**ధాష్టీకపు కరణం** - తహసీల్దారు. ఆ రోజుల్లో పాతతరం ఆసాములు యిలాగే వ్యవహరించేవారు. వారికి కరణం అంటే చాలా శక్తివంతం. అందుకని కరణం పేరుతోనే పైవారిని కూడా పిలిచేవారు. ఉదా: జిల్లా కరణం (కలెక్టరు)


**పునర్దర్శన ప్రాప్తిరస్తు** - సంప్రదాయం, ఆచారం తెలిసిన అర్చకస్వాముల దీవెన యిలాగే వుంటుంది. ఆరోగ్యం, ఐశ్వర్యం, కుటుంబం అన్ని బాగుండి, మళ్లీ దర్శనానికి రావాలని ధ్వని.

**కరావలంబ స్తోత్రం** - శ్రీశంకరాచార్య విరచితం. శంకరుడు దేహాన్ని వీడి పరకాయ ప్రవేశం చేసినపుడు నిజదేహాన్ని శత్రువులు అగ్నిపాలు చేయబోతే భగవత్పాదులు ఆశువుగా చెప్పిన స్తోత్రం. ఇది అగ్ని నుంచి రక్షిస్తుందని విశ్వాసం.

*రచన విహంగవీక్షణ సంపుటి*
*ఉగాది 2019*

*రచన సంచికపై 2018 అని ఉంటుంది.*
*కానీ ఆ సంచిక 2019 ఫిబ్రవరిలో విడుదలైంది.*

❋



21 సెప్టెంబర్ 1952న గుంటూరు జిల్లాలో పుట్టిన **శ్రీరమణ** అసలు పేరు వంకమామిడి రాధాకృష్ణ (కామరాజు రామారావు). వీరి మొదటి కథ ***వెలుగు తగ్గని వజ్రం*** 1970లో ఆంధ్రపత్రికలో అచ్చయినా, 1993లో ఆంధ్రజ్యోతిలో అచ్చయిన *బంగారు మురుగు* కథతో కథారచయితగా గుర్తింపు పొందారు. *మిథునం, సింహాచలం సంపెంగలు* కథాసంపుటాలు ప్రచురించారు. అనేక హాస్యరచనలు, వందల కొద్దీ పేరడీలు రచించారు. బాపు-రమణలతో కలిసి కొన్ని సినిమాలకు, అనంతరం వివిధ పత్రికలలోనూ పనిచేశారు.

**చిరునామా: 27, ఓమ్‌నగర్, న్యూ మహ్మదీలైన్స్, హైదరాబాద్-500008**
**ఫోన్: 90102 10201 email: srisriramana@gmail.com**